హాస్యాప్
గత వారంలోజుల పై వెలుగోస్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-11-2024 శనివారం సంపుటి: 30 సంచిక: 281 పేజీలు: 8+4 వెల: 6.50



వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా సుసీవైల్స్ నియామకం 3

ఇంకా వెలువడని రెండు రాష్ట్రాల ఫలితాలు 5




## సునీతా విలియమ్స్ ఆరోగ్యం ఓకే

### ఎప్పటికప్పుడు జరుగుతున్న వైద్య పరీక్షలు: అంతరిక్ష కేంద్రం నాసా వెల్లడి

**న్యూయార్క్, నవంబరు 8:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న భారతీయ అమెరికన్ ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్ ఆరోగ్యంపై ఇటీవల పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అయింది. ఐఎస్ఎస్‌లో సునీతా విలియమ్స్ బరువు తగ్గిపోయిందని, నీరసంగా ఉన్నట్లు ఒక ఫోటో బయటకువచ్చింది. దీనితో ఆమె తీవ్ర పోషకాహార లోపం ఎదుర్కొంటున్నారని, అందువల్లనే ఆమె బలహీనంగా కనిపిస్తున్నారని వార్తలు వెలువడ్డాయి. దీనితో సునీతా >>2



## రేపటినుంచి తీర్పులు ఇవ్వలేను.. విచారణకు హాజరు కాలేను

### రిటైర్మెంట్ సందర్భంగా ధన్యవాదాలు తెలిపిన సిజెఐ చంద్రచూడ్



**న్యూఢిల్లీ, నవంబరు 8:** కోర్టు హాలులో తాను ఉన్న కాలంలో ఎవరినైనా నొప్పించి ఉంటే అందరూ క్షమించాలని, ఇకపై రేపటినుంచి తాను తీర్పులు ఇవ్వలేనని, విచారణలకు కూడా హాజరుకాలేనని,తాను పదవీవిరమణ చేస్తున్నందున సహకరించిన అందరికీ ధన్యవాదాలు అంటూ ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ తన చివరి రోజు >>2

## 370 అధికరణం పునరుద్ధరణ ఏశక్తివల్లా కాదు



### కాంగ్రెస్, మిత్రపక్షాలు పాక్ అజెండాకు మద్దతిస్తున్నాయి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,నవంబరు 8:** జమ్ముకాశ్మీర్‌లో 370వ అధికరణాన్ని ప్రపంచంలోని ఏశక్తికూడా పునరుద్ధరించలేదని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షాలు పాకిస్థాన్ అజెండాకు మద్దతిస్తున్నాయని, వేర్పాటువాద భావజాలాన్ని రుద్దేప్రయత్నాలను కట్టడిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రచారాన్ని ప్రారంభించిన ప్రధాని ఎంవిఎపై ఘాటైన విమర్శలు విసిరారు. అగాడీ తప్పిందని, వక్రదిశలో పోతోందని ఎద్దేవాచేసారు. నాయకత్వమేలేని ఆగాడి అగాథంలోకి వెళ్లిపోతోందని విమర్శలు చేసారు. భారత రాజ్యాంగనుంచి జమ్ముకాశ్మీర్‌ను మినహాయించాలనే కాంగ్రెస్, ఇండియాకూటమి పార్టీలుచూస్తున్నాయని ఆరోపించారు. ప్రపంచంలోని ఏశక్తి కూడా 370వ అధికరణం పునరుద్ధరించలేవని ఆయన స్పష్టంచేసారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పుణ్యమా అన్ని కులాల మధ్య చిచ్చుపెడుతోందని ఒక కులంపై మరో కులాన్ని రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు. ప్రజలు సమైక్యంగా నిలిచి పోరాడాలని, ఐక్యంగా ఉంటేనే భద్రత పెరుగుతుందని మోడీ గుర్తు చేసారు. మహారాష్ట్రలోని ధూలేలో తన మొట్ట మొదటి ఎన్నికల ర్యాలీని ప్రారంభించారు.

ఈనెల 20వ తేదీ ఒకేరోజు పోలింగ్ జరిగే మహారాష్ట్ర ఎన్నికల్లో మళ్లీ మహాయుతి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. దళితులు, ఆదివాసిలను రెచ్చగొట్టేందుకు ఇపుడు రాజ్యాంగపరిరక్షణ నినాదం తెరపైకి తెచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, మిత్రపక్షాలు పాకిస్థాన్ అజెండాను ఎట్టిపరిస్థితుల్లోను ప్రోత్సహించకూడదని వేర్పాటువాదుల భాషను మానుకోవాలని ఆయన హితవుపలికారు. తనకు ప్రజలు ఆశీస్సులున్నంతకాలం ఈ అజెండా అమలుకు రాబోదని అన్నారు. జమ్ముకాశ్మీర్‌లో కేవలం అంబేద్కర్ రాజ్యాంగమే చెల్లుబాటు అవుతుందని అన్నారు. జమ్ముకాశ్మీర్‌లో చేసిన మొదటితీర్మానం మరిచిపోకూడదని >>2

# అడ్డొస్తే.. తొక్కిస్తా



శుక్రవారం నల్లగొండ జిల్లాలోని సంగెంవద్ద మూసీ ఒడ్డున పాదయాత్ర చేస్తున్న సిఎం రేవంత్

### మూసీ ప్రక్షాళనలో తననెవరూ ఆపలేరన్న సిఎం రేవంత్

### శివయ్య సంకల్పంతో ముందుకు సాగుతానన్న సిఎం

### ఇది ట్రయల్.. అసలు సినిమా జనవరిలో..

### కెటిఆర్ పాదయాత్ర కాదు.. మోకాళ్లయాత్ర చేసినా ప్రజలు నమ్మరు

### సంగెంవద్ద మూసీ ఒడ్డున పాదయాత్రలో ముఖ్యమంత్రి

**భువనగిరి, వలిగొండ, ప్రభాతవార్త:** మూసీ నది ప్రక్షాళనకు ఎవరు అడ్డొచ్చినా బుల్డోజర్లతో తొక్కిస్తామని సిఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మూసీ పునర్జీవనాన్ని బీఆర్ఎస్, బిజెపి అడ్డుకుంటున్నాయన్నారు. శివయ్య సంకల్పంతో మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం అని స్పష్టం చేశారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనలో భాగంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానంతరం వలిగొండ మండలం, సంగెం వద్ద మూసి నది ఒడ్డున ఉన్న భీమలింగం శివయ్యకు పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చేసే పాదయాత్ర ట్రయల్ మాత్రమేనని త్వరలోనే అసలు సినిమా చూపిస్తామన్నారు. జనవరి మొదటి వారంలో వాడపల్లినుంచి చార్మినార్ వరకు పాదయాత్ర నిర్వహిస్తామని స్పష్టంచేశారు. కెటిఆర్ పాదయాత్ర కాదు.. మోకాళ్లయాత్ర చేసినా ప్రజలు >>2

## యాదగిరిగుట్టగా మళ్లీ పేరు మార్పు

### టిటిడి తరహా ధర్మకర్తల మండలి ఏర్పాటు

3లో

### పుట్టినరోజు సందర్భంగా లక్ష్మీ నరసింహస్వామిని దర్శించిన సిఎం రేవంత్ రెడ్డి



శుక్రవారం యాదగిరిగుట్ట క్షేత్రంలోని పుష్కరిణివద్ద పాదప్రక్షాళన చేస్తున్న సిఎం రేవంత్ తదితరులు

### ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు

## విచారణ వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు8:** బిఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై శుక్రవారం హైకోర్టులో విచారణజరిగింది. బిఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది మోహన్ రావు హైకోర్టులో వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదని హైకోర్టుకు తెలిపారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్ విచారణకు అర్హమైనది కాదన్నారు. అనర్హత పిటిషన్లపై సభాపతి సకాలంలో నిర్ణయం తీసుకోవాల్సిందే అన్నారు. ఈ సందర్భంగా పలు కోర్టుల తీర్పులను మోహన్ రావు ప్రస్తావించారు. వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది. కాగా, ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్‌కు వెళ్లారు.

### అమోయ్ కుమార్ కేసు:

## డిజిపిని కలిసిన ఇడి అధికారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు8:** రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన ఐఎఎస్ అధికారి అమోయ్‌కుమార్ భూ కుంభకోణంలో ఇడి విచారణ కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో అమోయ్‌కుమార్‌పై భూదాన్ ట్రస్ట్ భూముల బాధితులు ఇప్పటి వరకు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులపై జరిగిన విచారణ తాలుకూ వివరాలను తమకు ఇవ్వాలని ఇడి అధికారులు శుక్రవారం సాయంత్రం నేరుగా డిజిపి జితేందర్‌ను కలిసి కోరారు. ఈ కేసులో ఇప్పటి వరకు అమోయ్‌కుమార్‌పై రంగారెడ్డి జిల్లా నాగారంలోని భూదాన్ భూములను సాగు చేస్తున్న రైతులు చేసిన ఫిర్యాదులపై పోలీసులు అధికారులు జరిపిన విచారణ వివరాలను తమకు ఇవ్వాలని ఇడి అధికారులు కోరారు. అమోయ్‌కుమార్ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్‌గా పనిచేసినప్పుడు నాగారంతో పాటు వట్టి నాగులపల్లిలో భూదాన్ భూములను, అసైన్డ్ భూములను రైతుల వద్ద నుంచి బలవంతంగా తీసుకుని రియల్టర్లకు అప్పగించడం సంచలనం రేపింది. దీనిపై ఆయా ప్రాంతాల రైతులు అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ప్రభుత్వానికి కూడా లేఖలు అందించారు. ఇదే విషయంపై తాజాగా వారంతా ఇడి అధికారులను >>2

### మేఘా కృష్ణా రెడ్డిని

# అరెస్టు చేసే దమ్ముందా?

### మూసీ బాధితలు ఉన్నదెక్కడ? హైదరాబాద్‌లోనా, నల్లగొండలోనా?: కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు8:** హైదరాబాద్‌లో మూసీ బాధితులు ఉంటే నల్గొండ జిల్లాలో మూసీ పరివాహక ప్రాంత రైతులను సిఎం రేవంత్ రెడ్డి కలవడంలో ఆంతర్యం ఏంటని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు.

సిఎం రేవంత్ రెడ్డి చేపట్టే మూసీ నది పునరుజ్జీవ సంకల్ప పాదయాత్రపై కెటిఆర్ ట్విటర్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లో ఇళ్లు కూల్చి నల్గొండ మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటించడం ఏంటని ప్రశ్నించారు. కూల్చిన ఇళ్లు ఎక్కడ తిరుగుతున్న ప్రాంతం ఎక్కడ అంటూ ధ్వజమెత్తారు. మోకాలికి దెబ్బతగిలితే బోడి గుండుకు కుట్లు వేసినట్టు రేవంత్ రెడ్డి పాలన ఉందని ఎద్దేవాచేశారు. హైదరాబాద్‌లో మూసీ బాధితులు ఉంటే నల్గొండ జిల్లాలో మూసీ పరివాహక ప్రాంత రైతులను రేవంత్ రెడ్డి కలవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు.

ఆగిన గుండెలెక్కడ, రగిలిన మనసులెక్కడ.. మీరు చేసిన ఎర్రరంగు మార్కింగ్ ఎక్కడ, మీరు చేస్తున్న పాదయాత్ర ఎక్కడ? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మీ కుట్రలకు అంబర్‌పేట్ అత్తాపూర్ అతలాకుతలం అవుతుంటే పుట్టినరోజు వేడుకలను రేవంత్‌రెడ్డి జరుపుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మూసీ దాహానికి అత్తాపూర్ ఆగమైందని, గోల్నాక గొల్లుమంటుందని, దిల్‌సుఖ్ నగర్ ఢీలా పడ్డిందని కెటిఆర్ అన్నారు. ముఖ్యమంత్రి అన్యాయాలకు ఆవేదనలు,ఆవేశాలు, ఆక్రందనలు వినిపిస్తున్నవి, కనిపిస్తున్నవి నల్గొండలో కాదని అన్నారు. హైదరాబాద్ వైపు చూడాలని, ఈ ప్రాంతంలో పాదయాత్ర చేయాలని సవాల్ విసిరారు. తేలు మంత్రం వేయడం తెలియని వ్యక్తి, పాము కాటుకు మంత్రం వేసినట్లు, పాలన తెలియని రేవంత్ రెడ్డికి పగ్గాలు అప్పగిస్తే ప్రజల బతుకుల్లో మట్టి పోశారంటూ మండి పడ్డారు. నాయకత్వం అంటే కూల్చడం >>2

## పదివేల మంది సర్పంచ్‌ల చేత ప్రమాణం 5లో



శుక్రవారం శ్రీశైలం జలాశయంలో ట్రయల్ రన్‌కు వచ్చిన విమానం

## జల విమానాలు రెడీ

### ఎపిలో ట్రయల్ రన్ సక్సెస్

### విజయవాడనుంచి బయల్దేరి శ్రీశైలం జలాశయంలో దిగిన సీ-ప్లేన్

**శ్రీశైలంప్రాజెక్టు,నవంబరు 8,ప్రభాతవార్త:** ఏపి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు టూరిజం హబ్‌గా శ్రీశైలంను అభివృద్ధి చేసే క్రమంలో నూతనంగా శనివారం విజయవాడ ప్రకాశం బ్యారేజి నుండి శ్రీశైలంకు యాత్రికులు ప్రయాణం చేసేందుకు సి ప్లేయిన్‌ను నూతనంగా ప్రారంభించడం జరుగుతుంది. ఈక్రమంలో శుక్రవారంవిజయవాడ ప్రకాశం బ్యారేజి నుండి శ్రీశైలంకు ఉదయం ట్రయల్ రన్ నిర్వహించడం జరిగింది. విజయవాడ నుండి వచ్చిన సి ప్లేయిన్ శ్రీశైలం పాతళగంగ బోటింగ్ పాయింట్‌లో సేఫ్‌గా ల్యాండు అవ్వ డం జరిగింది. ట్రయల్‌రన్ అనేది విజయ వంతంగా ముగిసింది. కాగా సిప్లేయిన్ ల్యాండుకావడంతో నంద్యాల జిల్లా సర్వోన్న తాధి కారి రాజకుమారి గణియా,జిల్లా ఎస్పి అధి రాజ్‌సింగ్ రాణా, సిఎం కార్యక్రమాల కో- ఆర్డినేటర్ వెంకటేశ్వర రావు, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్,ఏఎసెల్ బృందం అధికారులు క్షేత్రస్థా యిలో పరిశీలించారు.అదేవిధంగా నేడు ముఖ్య >>2

### కాంగ్రెస్ సర్కార్‌కు కెటిఆర్

# యాక్టింగ్ సిఎం

### మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు8:** కాంగ్రెస్ ప్రభుత్వానికి కెటిఆర్ యాక్టివ్ సిఎం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఇరు పార్టీలు రోజుకో అంశాన్ని ప్రస్తావించి మళ్లీ దాని ఊసెత్తడం లేదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కాంప్రమైజ్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం బిజెపి కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా రేవంత్, తాను కొట్లాడామని, అందుకే మేమిద్దరం కెటిఆర్ కలలోకి వస్తున్నామన్నారు. డైవర్షన్, కాంప్రమైజ్ పాలిటిక్స్ చేసే అలవాటు కెటిఆర్‌కే ఉందని విమర్శించారు. జన్వాడా ఫార్మ్ హౌస్ కేసు, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు కేసుల్లో హంగామా చేసిన కెటిఆర్ ఆ తర్వాత రేవంత్‌తో కుమ్మక్కై వాటి విషయం మరిచిపోయారన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ట్విటర్‌లో తప్ప ఎక్కడా కనిపించరని ఎద్దేవా చేశారు. కెటిఆర్‌కు కళ్లు నెత్తికెక్కాయని అంటూ బిఆర్ఎస్‌లో క్రెడిబిలిటీ ఉన్న లీడర్ హరీశ్‌రావు మాత్రమే అనిబండి సంజయ్ అన్నారు. ఎక్కడో భువనగిరిలో కాకుండా మూసీ పక్కన ఇల్లు కూలగొట్టే దగ్గర సిఎం >>2



ప్రభాకర్ రావు



శ్రవణ్ రావు

## ఇంకా దొరకని ప్రభాకర్‌రావు, శ్రవణ్

### పోలీసులకు సవాల్‌గా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు

### ఏడు నెలలు పైగా జైల్లో ఉన్న నలుగురు నిందితులు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్న చందాన మారింది. ఈ కేసు వెలుగులోకి వచ్చి ఎనిమిది నెలలు దాటడం, అమెరికాలో తలదాచుకున్న నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు, మీడియా అధినేత శ్రవణ్ రావుల అరెస్టుకు ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ విషయంలో, పాస్‌పోర్టుల రద్దు విషయంలో స్పష్టత కొరవడగా దీనిపై పోలీసు ఉన్నతాధికారులు సరైన వివరాలు వెల్లడించక పోవడంతో కేసు విచారణ ఎలా సాగుతుందనేదానిపై అనుమానాలు రేగుతున్నాయి. మరోవైపు ఇదే కేసులో అరెస్టయి ఏడు నెలలకు పైగా చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్న ఎస్ఐబి మాజీ డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ రావు, భూపాలపల్లి మాజీ అదనపు ఎస్‌పి భుజంగరావు, ఎస్ఐబి మాజీ అదనపు డిసిపి తిరుపతన్న, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావుల విషయంలో పోలీసులు కోర్టుకు మరికొన్ని రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడించకుంటే వారికి బెయిలు రావడం తో పాటు మొత్తం కేసు నీరుగారే ప్రమాదం వుందని నిపుణులు అంటున్నారు.

రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపి, పోలీసు శాఖలో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ఎనిమిది నెలలు కావస్తున్నా చిక్కులు, సమస్యలు వీడడం లేదు. ఈ ఏడాది మార్చి నెల మొదటి వారంలో ఈ కేసు వెలుగు చూడడం తెలిసిందే. ఎస్ఐబి అప్పటి అదనపు ఎస్‌పి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో దీనిపై కేసు నమోదవడం తెలిసిందే. అనంతరం ఈ కేసులో మొదట ఎస్ఐబి మాజీ డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ రావును అరెస్టు చేయగా ఆ తరువాత అదనపు ఎస్‌పిలు భుజంగ రావు, తిరుపతన్న, అనంతరం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావులను అరెస్టు చేయడం విదితమే. వీరంతా ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో వున్నారు. ఈ నలుగురిని పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచా >>2

## యాదాద్రి సిఎం పర్యటనలో స్వల్పఉద్రిక్తత

### భద్రతావైఫల్యంతో సిఎం వద్దకు గుంపులు గుంపులుగా తోసుకొచ్చిన కార్యకర్తలు

### సిఎం ఆలయంలోకి వెళ్లే క్రమంలో తోపులాట

### ఇబ్బందులు పడ్డ మంత్రులు

**యాదగిరిగుట్ట, నవంబరు 8, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండపైన స్వామివారి అఖండ దీపారాధన ప్రత్యేక పూజలో నిర్వహిస్తున్న సమయంలో పోలీసు భద్రత వైఫల్యంతో కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారిగా గుంపులు గుంపులుగా తోసుకుంటూ ముఖ్యమంత్రి వద్దకు చేరుకోవడంతో పోలీసులు వారిని ఆపే ప్రయత్నంలో విఫలమయ్యారు. దాంతో కాంగ్రెస్ శ్రేణులను రెండు వర్గాలలో రెడ్ కార్పెట్‌కు బయట నిలబడాలని పోలీసులు సూచించారు. వారి మధ్య నుండి ముఖ్యమంత్రి ఆలయంలోకి వెళ్లే క్రమంలో కాంగ్రెస్ శ్రేణులలో ఒక్కసారిగా తోపులాట జరగడంతో ఆలయం లోపటికి వెళ్లే మంత్రులు ఇబ్బందులు పడుతుండడంతో పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను ఆపే ప్రయత్నంలో పోలీసులకు కాంగ్రెస్ శ్రేణులకు మధ్య స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

# యాదగిరిగుట్టగా మళ్లీ పేరు మార్పు

### టిటిడి తరహాలో ధర్మకర్తల మండలి ఏర్పాటు

### పుట్టినరోజు సందర్భంగా లక్ష్మీనరసింహస్వామిని దర్శించిన సిఎం రేవంత్‌రెడ్డి

### సిఎం పర్యటనలో భద్రతాలోపంతో స్వల్పఉద్రిక్తత

**యాదగిరిగుట్ట, నవంబరు 8, ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. హెలికాప్టర్‌లో యాదగిరిగుట్ట చేరు కున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ లో ప్రెసిడెంట్ షూట్ కు చేరుకొని అక్కడ నుండి నేరుగా స్వామి వారి ఘాట్ రోడ్ మార్గంలో కొండపైకి చేరుకొని కొండపైన విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్పం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి విష్ణు పుష్కరిణిలో నీటిని తలపై చలుకున్నారు.. అనంతరం విష్ణు పుష్కరిణి నుండి కొండపైన బస్టాండ్ సమీపంలో ర్యాంపు మార్గంలో నడుచుకుంటూ ఆలయ ప్రాంగణానికి చేరుకుని ముందుగా కొండపైన స్వామివారి అఖండ జ్యోతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ తూర్పు రాజగోపురం గుండా ఆలయంలోనికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి ముందుగా ధ్వజ స్తంభం వద్ద మొక్కి తదుపరి అంతరాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. దర్శనానంతరం ముఖ్యమంత్రికి ఆలయ ముఖ మండపంలో వేద మంత్రాలతో వేదాశ్వీరచనం గావించడం జరిగింది. రాష్ట్ర దేవాయదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ చేతులమీదుగా ముఖ్య మంత్రి, మంత్రులను శాలువాతో సత్కరించారు. స్వామి వారి మెమెంటోను అందజేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి స్వామివారి ప్రసాదాన్ని అందచేశారు. అనంతరం కొండ కింద ప్రెసిడెంట్ షూట్లో లో రివ్యూ మీటింగ్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయాలను వెల్లడించారు. పెండింగ్ పనులకు నిధుల వర్షం యాదాద్రి ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష నిర్వహించార. ఈ సమీక్షలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. టీటీడీ తరహాలో యాదగిరిగుట్టలో టెంపుల్ బోర్డు ఉండాలని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం యాదాద్రిగా పిలుస్తున్న పేరును యాదగిరిగుట్టగా మార్చాలని ఆదేశించారు. అలాగే ఆలయ ప్రాంగ ణంలో ఉన్న గోశాలలో గోసంరక్షణకు ప్రత్యేక పాలసీని తీసుకురావాలని, అవసరమైతే టెక్నాలజీని వాడుకోవాలని సూచించారు. కొండపై నిద్రచేసే భక్తులు తమ మొక్కుల్ని తీర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలని, బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులను పూర్తి చేయాలని తెలిపారు. అలాగే ఆలయ అభివృద్ధి కోసం చేస్తున్న భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని, ఈ మేరకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి వారం రోజుల్లో పూర్తి వివరాలు, ప్రపోజల్స్ తో రావాలని ఆదేశించారు. ఆలయానికి సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుని.. పెండింగ్ పనులు, ఇతర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇకపై అన్ని రికార్డుల్లో యాదాద్రిని యాదగిరిగుట్టగా మార్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర ముఖ్య మంత్రి తో పాటు , పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,టూరిజం, సినిమా టోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య,సీ ఎస్ శాంతి కుమారి,ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, దేవాదాయశాఖ కమీషనర్ హనుమంత్ కె. జండగే జిల్లా కలెక్టర్ హనుమంతరావు , రాచకొండ సి పి సుధీర్ బాబు తోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



శుక్రవారం యాదాద్రీశుడి ఆలయ సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకస్వాములు

## రేవంత్‌రెడ్డి ఆయురారోగ్యాలతో జీవించాలి: ప్రధాని నరేంద్రమోడీ

### ఆయన ఆరోగ్యం, దీర్ఘాయువు కోసం ప్రార్థిస్తున్నా: ఎపి సిఎం చంద్రబాబునాయుడు

### పవన్‌కళ్యాణ్, గడ్కరీ, జిష్ణుదేవ్, బండి సంజయ్, చిరు శుభాకాంక్షలు

### సిఎం రేవంత్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 8:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభా కాంక్షలు వెల్లువలా వచ్చాయి. ప్రధాని మోడీతో పాటు అనేకమంది ముఖ్యమంత్రులు, మంత్రులు, నాయకులు సోషల్ మీడియా వేదికగా రేవంత్ రెడ్డిని విష్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డికి ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రధాని ఆకాంక్షించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేశారు. మోదీ బర్త్‌డే విషెస్‌పై స్పందించిన రేవంత్‌రెడ్డి. 'హృదయపూర్వక శుభాకాంక్షలకు కృతజ్ఞతలు' అని రీట్వీట్ చేశారు.

మరోవైపు మెగాస్టార్ చిరంజీవి కూడా సీఎం రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది రేవంత్ రెడ్డికి అద్భుతంగా సాగాలని, ఆయన దీర్ఘాయుష్షుతో పాటు మంచి ఆరోగ్యంతో ఉండాలని చిరంజీవి ఆకాంక్షించారు. ఈ మేరకు చిరు ట్వీట్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కూడా రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. 'గౌరవనీయులైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు. ఆయన ఆరోగ్యం, దీర్ఘాయువు కోసం ప్రార్థిస్తున్నాను' అంటూ ఎక్స్ వేదికగా చంద్రబాబు చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.

ఇక ఎపి డిప్యూటీసిఎం పవన్‌కల్యాణ్ కూడా సీఎం రేవంత్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎం రేవంత్ రెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆరోగ్యం, దీర్ఘాయువుతో తెలంగాణ రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చే శక్తి పొందాలని అభిలాషిస్తున్నాను' అంటూ పవన్‌కల్యాణ్ కూడా ట్వీట్ చేశారు. అమెరికా కాన్సెల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ సిఎం రేవంత్‌రెడ్డికి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా సిఎం రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రమంత్రి బండి సంజయ్ సిఎం రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యుకె ఎంబసీ అధికారి గారెత్‌వ్యాన్ ఓవన్ సిఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య సిఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సిఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ కాంగ్రెస్ ప్రదేశ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సిఎం రేవంత్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి యాదాద్రిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మూసీ పునరుజ్జీవ సంకల్ప పాదయాత్ర చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 1969 నవంబర్ 8న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్‌లోని కొండారెడ్డి పల్లిలో జన్మించారు. శుక్రవారంతో ఆయనకు 55 ఏళ్లు. ఇక రేవంత్‌రెడ్డి 2023 డిసెంబర్ 7న తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్య తలు చేపట్టారు. అంతకుముందు ఆయన మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యునిగా పనిచేశారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

# మంత్రివర్గ ఉపసంఘం

### కమిటీ చైర్మన్‌గా భట్టి విక్రమార్క

### ఉత్తర్వులిచ్చిన సర్కార్

### ఉద్యోగ సంఘాల జెఎసి హర్షం

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ముగ్గురు మంత్రులతోపాటు ఒక ప్రభుత్వ సలహాదారుని ప్రత్యేక ఆహ్వానితుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బందితోపాటు పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడం కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి అయిన మల్లు భట్టి విక్రమార్క చైర్మన్‌గా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ప్రభుత్వ సలహాదారు (పబ్లిక్ ఎఫైర్స్) కే కేశవరావును ప్రత్యేక ఆహ్వాని తునిగా జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శిని మెంబర్ సెక్రటరీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం జీవో ఆర్‌టీ నంబర్ 1481ని జారీ చేశారు. కమిటీ ఉద్యోగులు, పెన్షనర్లతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని ఉత్తర్వులో ఆదేశించింది. మంత్రివర్గ ఉప సంఘం సమావేశం సందర్భంగా వివిధ శాఖలకి చెందిన ఉన్నతాధికారులు హాజరుకావాలని సూచించింది. ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం పట్ల తెలంగాణ ఉద్యోగుల జేఏసీ హర్షాన్ని ప్రకటించింది. మంత్రివర్గ ఉపసంఘం త్వరితగతిన సమావేశాలు ఏర్పాటుచేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల జెఏసి చైర్మన్ మారం జగదీశ్వర్, జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు.



## వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా సూసీ వైల్స్

**వాషింగ్టన్, నవంబరు 8:** అమెరికా నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్ ట్రంప్ తన ఎన్నికల ప్రచార మేనేజర్ సూసీ వైల్స్‌ను వైట్‌హౌస్ చీఫ్‌ఆఫ్ స్టాఫ్‌గా నియమించారు. అధ్యక్ష ఎన్నికల్లోట్రంప్‌ను విజయతీరాలకు చేర్చడంలో ఆమెది కీలకపాత్ర. ఎంతో కట్టుదిట్టంగా క్రమశిక్షణతో ట్రంప్ తన ప్రచారాన్ని నిర్వహించడం వెనుక ఆమె కీలకభూమిక పోషించి రిపబ్లికన్ వర్గాల్లో మంచిపేరు సాధించారు. అమెరికా చరిత్రలో మొట్టమొదటి మహిళా చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీనే కావడం విశేషం. ట్రంప్ తన విజయ ప్రసంగంలో ఆమెకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినా నిరాకరించారు. సూసీ కఠినమైన తెలివైన వినూత్న ఆలోచనలు కలిగిన వ్యక్తి. ప్రపంచ వ్యాప్తంగా గౌరవం ప్రశంసలుపొందారు. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చేందుకు అవిశ్రాంతంగా కృషిచేస్తారు. దేశం గర్వపడేలా ఆమె పనిచేస్తారనడంలో సందేహంలేదని ట్రంప్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్లోరిడాకు చెందిన సూసీ దీర్ఘకాలంగా రిపబ్లికన్ వ్యూహ కర్తగా ఉన్నారు. 2016, 2020ల్లో రాష్ట్రంలోట్రంప్‌ప్రచార బాధనయత లను తన భుజాలకెత్తుకున్నారు. 2010లో ఫ్లోరిడా గవర్నర్‌పదవికోసం రిక్‌స్కాట్‌ప్రచారాన్ని నిర్వహించారు. యుటా మాజీ గవర్నర్ జాన్ హంట్స్‌మన్ 2012 అధ్యక్షప్రచారానికి మేనేజర్‌గా పనిచేసారు.

# భూమి ఉన్నంతకాలం ప్రజల గుండెల్లో కెసిఆర్

### సిఎం రేవంత్‌రెడ్డి ఆనవాళ్లు చెరిపేస్తానని చెబితే జనం నవ్వుకుంటున్నారు..

### 11 నెలల పాలనలో ప్రభుత్వం ఒరగబెట్టిందేమిలేదు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం రేవంత్‌రెడ్డి అనవాళ్లు చెరిపేస్తానని చెబితే ప్రజలు నవ్వుకుం టున్నారని..ఈ భూమి ఉన్నంతకాలం కెసిఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో ఉంటారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రం లోని తన క్యాంపు కార్యా లయంలో శుక్ర వారం 237 మంది లబ్ధిదా రులకు రూ.54.50 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీని, తెలం గాణకు స్వాతంత్ర్యం తెచ్చిన కెసిఆర్‌ను ప్రజలు మరిచిపోరన్నారు. కెసిఆర్ అనవాళ్లు లేకుండా చేస్తానని చెప్పిన సిఎం కెసిఆర్ కట్టిన యాదాద్రి లోనే పుట్టిన రోజు చేసుకున్నారని తెలిపారు. మూసి సుందరీకరణలో భాగంగా మంచినీళ్ల సైతంన కెసిఆర్ కట్టించిన కాళేశ్వరం నుంచి మౌసికి తరలిస్తున్నాడని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి 11 నెలల పాలనలో కూలగొట్టమే తప్ప కట్టే విధానం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు చేత గానీ హామీలు ఇచ్చి నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి రాగానే మొండి చెయ్యి చూపుతున్నారని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో 15 రోజుల్లో నాలుగు గురుకుల పాఠశాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు అయ్యాయని వాపోయారు. రేవంత్‌రెడిన్ల బెదిరింపులకు బిఆర్‌ఎస్ భయపడద్దన్నారు. సిఎం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బిఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని..రేవంత్‌రెడ్డి చేత హామీలను అమలు చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు గుండు భూపేష్, రవీందర్‌రెడ్డి, సాయిరాం, రాధా కృష్ణశర్మ, రమేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

## డ్రగ్స్ కేసులో ఉగాండా మహిళకు 13 యేళ్ల జైలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 8:** ఓ డ్రగ్స్ కేసులో ఉగాండా మహిళకు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కోర్టు 13 సంవత్సరాల శిక్ష విధించింది. పోలీసులు ఆమెను నాలుగేళ్ల క్రితం అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం ఆమెకు కోర్టు ఈ శిక్షను విధించింది. సదరు మహిళ హరారే నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకువచ్చింది. 2021 జూన్‌లో ఆమెను డీఆర్‌ఐ అధికారులు అరెస్ట్ చేశారు.ఆమె నుంచి డీఆర్‌ఐ అధికారులు 3.900 కిలోగ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న హెరాయిన్ విలువ దాదాపు రూ.25.35 కోట్లు ఉంటుందని అధికారులు గుర్తించారు. కోర్టు.. నిందితురాలికి పదమూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధించింది.


**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ**

**స్పెషల్ ఈ-వేలం ప్రకటన**

ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే అనే ప్రతిపాదికన పనికిరాని వాహనాలు/బస్ బాడీస్/టైర్లు/ మెటీరియల్ మొదలగు వాటి ఇ-వేలం M/s NCDEX e-Markets Ltd, Hyderabad వారిచే నిర్వహించబడును.(ఫోన్ నెం.8121156977 & 7569819838). 1) కరీంనగర్ (KRMR) తేది: 27.11.2024, 2) ఉప్పల్ (HZ/UPL) తేది: 04.12.2024. రిజిస్ట్రేషన్ మరియు ఇతర వివరములకు www.neml.in మరియు TGSRTC వెబ్‌సైట్ https://tgsrtc.telangana.gov.in (Tenders)ను చూడగలరు.

సం/- చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్

DIPR.No.6347-PP/CL/Advt/1/2024-25, తేది: 08.11.2024


## 18 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు గడువు

### అపరాధ రుసుంతో డిసెంబరు 21 వరకు అవకాశం

### ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కృష్ణారావు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకి మార్చిలో జరిగే వార్షిక పరీక్షలకి సంబంధించిన ఫీజు గడువును ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 18 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించడానికి అవకాశం కల్పిస్తున్నట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు ఏ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ. 50తో డిసెంబర్ 2 వరకు, రూ. 200 అపరాధ రుసుంతో డిసెంబర్ 12 వరకు.. అలాగే అపరాధ రుసుం రూ. 500తో డిసెంబర్ 21 వరకు అవకాశం కల్పించినట్టు కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులకి అన్ని పరీ క్షలకు రూ. 125గా ఫీజును నిర్ణయించారు. మూడు అంతకంటే తక్కువ సబ్జెక్టులకి రూ. 110, మూడు అంతకంటే ఎక్కువ సబ్జెక్టులకి రూ. 125గా నిర్ణయించారు. ఒకేషనల్ విద్యార్థులకి రెగ్యులర్ ఫీజుతోపాటు అదనంగా రూ. 60 చెల్లించాలని పేర్కొన్నారు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామాల్లోని వారికి రూ. 20వేల లోపుగా.. పట్టణాలు, నగరాల్లోని వారికి రూ. 24వేల లోపు ఉన్న వారికి పరీక్ష ఫీజును మినహాయించనున్నారు. గత ఏడాది సుమారు 5 లక్షల మంది పరీక్షలకు హాజరు కాగా.. ఈ ఏడాది కూడా 5 లక్షల మంది వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## కాంబోడియాకు యువకులను పంపిస్తున్న సైబర్ నేరగాడి అరెస్టు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** విదేశాల్లో ఉద్యోగాలు చేయా లనుకునే యువకులను పథకం ప్రకారం టార్గెట్‌చేసి వారిని కాం బోడియా సహా గోల్డెన్ ట్రయాంగల్‌లోని మిగతా దేశాలకు అక్రమంగా పంపుతూ వారిచేత బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్న ఓ బడా సైబర్ నేరగాడిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. సిరిసిల్లకు చెందిన ఓ యువకుడిని కాంబోడియాకు పంపి సైబర్‌నేరాలు చేయించిన కేసులో ఇతను నిందితుడు. వివరాలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజి శిఖాగోయల్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ యేడాది మే నెలలో సిరిసిల్ల జిల్లాలో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు కొందరు సైబర్ నేరగాళ్లపై కేసు నమోదయింది. తన కుమారుడికి విదేశాల్లో ఉద్యోగం అంటూ నమ్మించి లక్షా 40 వేల రూపాయలు తీసుకుని అతన్ని కాంబోడియా దేశానికి పంపి సైబర్ నేరాలు చేయిస్తున్నాడని వచ్చిన ఫిర్యాదు మేరకు సిరిసిల్లలో కేసు నమోదయ్యింది. జగిత్యాలకు చెందిన సాయిప్రసాద్, పుణెకు చెందిన మహమ్మద్ అబిద్‌హుస్సేన్ అన్సారి, బీహార్‌కు చెందిన మహమ్మద్ షాదాబ్ ఆలం ఇదివరకే అరెస్టయ్యారు. ఈ కేసులో కీలకంగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని తౌమిక్‌పూర్‌కు చెందిన సదాఖత్‌ఖాన్ (37) విదేశాలకు పారిపోగా లుకవుట్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 2న అతను మాల్దీవుల నుంచి ఢిల్లీ అంతర్జాతీయ విమా నాశ్రయానికి రాగా ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్టుచేసి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులకు అప్పగించారు. ఇతనిపై సిరిసిల్లలో నమోదైన కేసులో అరెస్టుచేసి రిమాండుకు తరలించారు.


**ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్**

(భారత ప్రభుత్వ చట్టబద్దమైన సంస్థ)

(విద్యా మంత్రిత్వ శాఖ)

నెల్సన్ మండేలా మార్గ్, వసంత్ కుంజ్, న్యూఢిల్లీ-110070

వెబ్ సైట్: www.aicte-india.org ఫోన్ నెం. 011-29581000, 29581050

Government of India

**2025-26 ఆమోద ప్రక్రియ కోసం బహిరంగ ప్రకటన**

ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (AICTE) కింది ప్రతిపాదనల కోసం విద్యా భాగస్వాముల (స్టేక్‌హోల్డర్స్) నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది:

1. కింది ప్రోగ్రామ్‌లలో అన్ని స్థాయిలలో (డిప్లొమా. పోస్ట్ డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్. పోస్ట్ గ్రాడ్యుయేట్. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్. పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికేట్ ఇన్ మేనేజ్‌మెంట్ మరియు FPM (ఇన్ మేనేజ్‌మెంట్)) మొదలైనవి (BBA/BCA/BMS)తో సహా) కొత్త సాంకేతిక సంస్థలను ఏర్పాటు చేయడం
   - ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ
   - ప్లానింగ్
   - అప్లైడ్ ఆర్ట్స్ మరియు క్రాఫ్ట్స్
   - డిజైన్
   - హోటల్ మేనేజ్‌మెంట్ మరియు క్యాటరింగ్ టెక్నాలజీ
   - కంప్యూటర్ అప్లికేషన్స్
   - మేనేజ్‌మెంట్
2. ఇప్పటికే ఉన్న సాంకేతిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు లేదా విశ్వవిద్యాలయాలు (సెంట్రల్/స్టేట్/ ప్రైవేట్)గా పరిగణించబడే సంస్థల కోసం ఆమోదం పొడిగింపు.
3. సర్టిఫికేట్ / డిప్లొమాలో విశ్వవిద్యాలయాలుగా భావించబడే స్వతంత్ర సంస్థలు లేదా సంస్థల కోసం కింది ఫీల్డ్‌లలో ఓపెన్ మరియు డిస్టెన్స్ లెర్నింగ్ (ODL) లేదా ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌ల కోసం ఆమోదం/NOC డిగ్రీ:

**మేనేజ్‌మెంట్** - బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్ అండ్ ట్రావెల్ టూరిజం.

**కంప్యూటర్ అప్లికేషన్**-కంప్యూటర్ అప్లికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ మరియు బ్లాక్ చైన్.

దరఖాస్తుదారులందరూ AICTE ఆమోద ప్రక్రియ హ్యాండ్‌బుక్ (APH) 2024-25 నుండి 2026-27 వరకు, ఎప్పటికప్పుడు జారీ చేయబడిన ఏవైనా సవరణలతో పాటు, **www.aicte-india.org**లో అందుబాటులో ఉండేటటువంటివి క్షుణ్ణంగా చదవాలని దృఢంగా సలహా ఇస్తున్నారు. అకడమిక్ సెషన్ 2025-26 కోసం దరఖాస్తులను తప్పనిసరిగా AICTE వెబ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలి.

వెబ్ పోర్టల్ **నవంబర్ 6, 2024** నుండి ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. వివరణాత్మక షెడ్యూల్ మరియు టైమ్‌లైన్‌ల కోసం, దయచేసి **www.aicte-india.org**ని సందర్శించండి.

**గమనిక:** టెక్నికల్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్న లేదా నిర్వహించాలనుకుంటున్న అన్ని ఉన్నత విద్యా సంస్థలు 2025 -26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆమోద ప్రక్రియకు సంబంధించిన అధికారిక సమాచారాలు మరియు అప్‌డేట్‌లు, సాధారణ నోటిఫికేషన్‌ల కోసం **"Home>Quicklink: Approval Process 2025-26"** విభాగం క్రింద www.aicte-india.orgలో AICTE వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించబడింది.

ప్రొఫెసర్ రాజీవ్ కుమార్

మెంబర్ సెక్రెటరీ, AICTE

**Advt. No. - Regulation Bureau/AICTE/11(01)2024**  **CBC 21300/12/0013/2425**


## ఎప్‌సెట్(బైపిసి) ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో 10,692 సీట్ల కేటాయింపు

### 96.7 శాతం సీట్ల కేటాయింపు

### సీట్లు పొందినవారు 12లోపు కాలేజీల్లో చేరాలి.. లేకపోతే సీటు రద్దు

### సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ బైపీసీకి చెందిన వారికి ఎప్‌సెట్-2024(బైపీసీ) ద్వారా ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపును చేశారు. ఫైనల్ ఫేజ్‌లో 10,692 మందికి సీట్లను కేటాయించారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 11 లోపు కాలేజీల్లో ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి.. 12లోపుగా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. కాలేజీల్లో 12లోపు చేరకపోతే.. సీటు రద్దవుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ఎప్‌సెట్(బైపీసీ) ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో భాగంగా.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీట్లలో 96.7 శాతం సీట్లను కేటాయించినట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌లో భాగంగా .. బీ ఫార్మసీతోపాటు, ఫార్మా డీ, బయోటెక్నాలజీ, బయో మెడికల్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లను ఎప్‌సెట్(బైపీసీ)-2024 కౌన్సెలింగ్ ద్వారా చేపడుతున్న విషయం తెలిసిందే. మొత్తం 10,854 సీట్లలో మొదటి విడతలో 10,436 సీట్లు కేటాయించగా.. మరో 418 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఫైనల్ ఫేజ్ నాటికి 17,201 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. వారిలో 10,612 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. రాష్ట్రంలో 11,060 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 10,692 సీట్లను కేటాయించారు. మరో 368 సీట్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 127 బీ ఫార్మసీ కాలేజీల్లో 9002 బీ ఫార్మసీ సీట్లు అందు బాటులో ఉండగా.. వాటిలో 8649 సీట్లు కేటాయించారు. మరో 351 సీట్లు ఖాళీగా ఉన్నాయి. 75 ఫార్మా డీ కాలేజీల్లో 1691 ఫార్మా డీ సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 1684 సీట్లు కేటాయించారు. రెండు కాలేజీల్లో 58 బయో మెడికల్ ఇంజనీరింగ్ సీట్లు.. ఉండగా 58 సీట్లను కేటా యించారు. 4 కాలేజీల్లో 184 బయో టెక్నాలజీ సీట్లు ఉంటే వాటిలో కూడా 181 సీట్లను కేటాయించారు. 3 కాలేజీల్లో 125 ఫార్మాస్యూటికల్ సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 120 సీట్లను కేటాయించారు. మొత్తంగా రాష్ట్రంలో 11,060 సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో 10,692 సీట్లను కేటాయించగా.. 96.7 శాతం సీట్లను ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో కేటాయించారు. 553 ఈడబ్ల్యుఎస్ కోటాలో సీట్లను కేటాయించారు. 60 కాలేజీల్లో 100 శాతం సీట్లు కేటాయించారు. అందులో 8 యూని వర్సిటీ కాలేజీలు, ఒకటి ప్రభుత్వ కాలేజీ ఉండగా.. 51 ప్రైవేటు కాలే జీలు ఉన్నాయి. సీటు పొందిన విద్యార్థులు ఫీజు చెల్లించి ఈ నెల 11 లోపుగా ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. 12లోపుగా సీటు పొందిన కాలేజీల్లో చేరకపోతే సీటు రద్దవుతుందని కమిషనర్ ప్రకటనలో స్పష్టం చేశారు.

వార్త

చేయకుండానే చేశాననేవాడు అధముడు, కొద్దిగా చేసి కొండంత చేశానని చెప్పేవాడు గర్వపోతు. ఎంతో చేసి కొంచెమే చేశానని చెప్పేవాడు సజ్జనుడు.

-ఆది శంకరాచార్యులు

# పౌష్టికాహారలేమిలో భారతావని

మా నవ వికాసానికే కాదు, రోగాలబారిన పడకుండా ఉండడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే ఆహారమే ఔషధంగా ఉండాలని ఎందరో పెద్దలు ఎంతోకాలం క్రితం సెలవిచ్చారు. ఆరోగ్యవంతమైన బలమైన ఉత్పాదక శక్తినిచ్చే ఆహారం మానవులకే కాదు దేశ ప్రగతికి కూడా అత్యంత కీలకమనే విషయం అందరికి తెలిసిందే. కానీ దేశవ్యాప్తంగా డెబ్భైశాతంపైగా జనాభా ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోతున్నారు. దాదాపు పదిహేను శాతం మంది ప్రజలు భారత్‌లో పౌష్టికాహారలోపంతో బాధపడుతున్నారని ఇటీవల ఆహార వ్యవసాయ సంస్థ ఒక నివేదికలో స్పష్టం చేసింది. అందుకే దేశంలో కోట్లాది మంది కేవలం పౌష్టికాహార లోపంతో రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవై శాతంపైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడించింది. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలు దాదాపు నలభైశాతం మంది తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలోఆరేడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపు మరణిస్తున్నారని ఎన్నో అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ భూమ్మీద పుట్టినవారికి ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది పాలక పెద్దలే. తల్లీబిడ్డకు పౌష్టికాహారం అందివ్వలేకపోవడం కూడా పాలకుల బాధ్యతారాహిత్యం కిందకే వస్తుంది. పర్యవేక్షణలోపం కారణంగా తల్లీబిడ్డలకు అందించాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగు చూసినా నిర్దిష్టమైన చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతుంది. ఈ పథకం కింద అందాల్సిన పౌష్టికాహారం పశువుల దాణాగా మారి ప్రైవేట్ డైయిరీలకు చేరుతుందనే ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పౌష్టికాహారలోపం పెచ్చరిల్లిపోతుందనే చెప్పొచ్చు. ఇటీవల ప్రపంచ ఆహార నివేదిక వెల్లడించిన సమాచారం ప్రకారం పౌష్టికాహార లోపంతో బాధపడేవారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా ఎనభైకోట్లకు పైగా ఉందని అంచనా. 2014తో పోలిస్తే ముప్ఫైశాతం అధికం. భారత్‌లో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషక ఆహార సమస్య అధికంగా ఉంది. 2019-20 మధ్య కాలంలో ముప్ఫైశాతం, భారత్‌లో పదహారు శాతం, పాకిస్థాన్‌లో పదిహేడు శాతం ప్రజలు పోషకాహార సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ప్రపంచంలో పోషకాహార లోపంతో బాధపడుతున్నవారిలో మూడోవంతు భారత్‌లోనే ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడిస్తున్నది. భారత్‌లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా లక్షలాదిమంది ఉద్యోగులు నిరంతరం కృషిచేస్తున్నారు.1975 లోనే ఆరేళ్లలోపు పిల్లలు తల్లులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఆనాటి కేంద్రప్రభుత్వం సమీకృత శిశు అభివృద్ధి పథకాన్ని (ఐసిడిసి) ప్రవేశపెట్టింది. ప్రధాన మంత్రి మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం పథకంలాంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి కొనసాగిస్తున్నారు. పౌష్టికాహారలోపాన్ని అధిగమించేందు కు పిల్లలకు కోడిగుడ్లు కూడా అందిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు పౌష్టికాహార లోపాన్ని తుడిచిపెట్టేందుకు ఎన్ని లక్షల కోట్లు వెచ్చించారో లెక్కలకే అందవు. అయినా భారత్‌లో పౌష్టికాహారలోపం ఎందరినో పట్టిపీడిస్తున్నది. భారత్ 121దేశాల్లో 107వ స్థానంలో ఉందని రెండేళ్లక్రితం ప్రపంచ ఆకలి సూచీలో వెల్లడయింది. ఈ పౌష్టికాహారలోపం కారణంగా ఆరోగ్యపరంగా ముఖ్యంగా మహిళల్లో చిన్నారుల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లల్లో దాదాపు ముప్ఫైశాతా నికిపైగా వయసుకు తగినఎత్తుకు పెరగడంలేదు. మరో పంతొమ్మిది శాతం ఎత్తుకు తగినబరువు ఉండడంలేదు. ముప్ఫైరెండు శాతం పిల్లల ఎదుగుదల లోపాలను ఎదుర్కొంటున్నారు. జార్ఖండ్, మహారాష్ట్ర, అసోం, గుజరాత్, తదితర రాష్ట్రాల్లో ఈ పౌష్టికాహార సమస్యలు అధికంగాఉన్నాయి. ఇంకోవైపు పదిహేనేళ్ల బాలికల నుండి యాభైయేళ్లలోపు ఉన్న మహిళల్లో దాదాపు యాభైఏడు శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎనభైశాతానికిపైగా సూక్ష్మపోషకాల కొరత ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు ప్రధానిప్రకటించారు. 2030 నాటికి పిల్లల్లో తీవ్రమైన పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు మూడువేల మూడువందల యాభైనాలుగు కోట్లవ్యయంతో ప్రత్యేక పథకం తేవాలని ఒడిశా ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. మరికొన్నిరాష్ట్రాలుకూడా ఆ కోణంలో ఆలోచించి పథకాలు ప్రవేశపెడుతున్నాయి. పథకాలు, ఉద్దేశ్యాలు అన్నిసక్రమంగా ఉన్నా సంతృప్తి కల్పించే విధంగాకనిపిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి చాలావరకు కాగితాలకే పరిమితమవుతున్నాయి. దళారుల ప్రమేయం పెరిగిపోతున్నది. ఆహారోత్పత్తులు, దిగుబడులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నా అందరికి రెండుపూటల ఆకలి తీర్చుకునేందుకు తిండిగింజలు అందించలేకపోతున్నారు. సమగ్రశిశు అభివృద్ధి పథకం కింద మాతాశిశు సంరక్షణ కోసం పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని 'కాగ్' ఏనాటినుంచోహెచ్చరిస్తూనేఉన్నది. ఇవి పాలకులకు తెలియందికాదు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తపథకాల గురించి ఆలోచించకపోయినా ఉన్న పథకాల్లోని లోపాలను సరిదిద్ది పర్యవేక్షణ పటిష్టం చేస్తే కొంతవరకైనా లక్ష్యానికి చేరుకోగలుగుతాం.

విద్య లేకపోయినప్పటికీ గర్వించేవాడు, దరిద్రుడైనప్పటికీ పెద్దఎత్తులు వేసేవాడు, పనులు చేయనప్పటికీ ధనాన్ని ఆశించే వాడు మూర్ఖుడు.



డబ్ల్యు ఎమర్సన్

అంధుని చేతికి ఆసరాగా ఊతకర్ర ఎంత అవసరమో ఆపదలో ఉన్న వారికి ధైర్యం అంత అవసరం.



రామకృష్ణ పరమహంస

# ఈ 'వెట్టి'కి విముక్తి ఇంకెప్పుడు?

**బ్రిటిష్ వారు ఆనాడు ఏమిచేయించారేమో కానీ కొందరు అధికారులు కానిస్టేబుళ్లతో చేయిస్తున్న పనులు వారి నోటి నుంచే వింటుంటే ఆవేదనే కాదు ఆందోళన కూడా కలుగుతుంది. కానిస్టేబుల్స్‌గా శిక్షణ ఇవ్వడానికి దాదాపు లక్షలాది రూపాయలకుపైగా వెచ్చిస్తున్నారు. నెలలపాటు ఆయుధాల వినియోగం, శాంతిభద్రతల పర్యవేక్షణ తదితర అంశాలపై పూర్తి తర్ఫీదునిస్తున్నారు. లక్షలు వెచ్చించి నెలలపాటు శిక్షణ ఇచ్చి సంఘ విద్రోహశక్తులు, అరాచక శక్తులపై తుపాకులు ఎక్కుపెట్టాల్సిన చేతులతో ఇసుక మోయించడం, గడ్డి పీకించడంలాంటి పనులు చేయించడం ఎంతవరకూ సమంజసమో ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించాలి.**

**దామెర్ల సాయిబాబ**

వెట్టిచాకిరీ ఎక్కడ ఏరూపంలో ఉన్నా పెకిలించి వేస్తామని పెద్దపెద్ద ప్రకటనలిచ్చే పాలకులు ప్రభుత్వ విభాగంలోనే దశాబ్దాల తరబడి కొనసాగుతున్న వెట్టిని నిర్మూలించలేకపోతున్నారంటే ఎవరికి చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా నేటికీ పోలీస్‌శాఖలో వెట్టిచాకిరీ కొనసాగుతున్నదంటే ఆవేదన కలుగక తప్పదు. గత నెల చివరివారంలో టిఎస్పీ బెటాలియన్లకు చెందిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు రోడ్ల పైకి వచ్చారు. ఒకే రాష్ట్రం, ఒకే పోలీస్ విధానం అమలు చేయాలంటూ వరంగల్, అదిలాబాద్, మంచిర్యాల తదితర జిల్లాల్లో ప్రత్యేక పోలీస్ కానిస్టేబుళ్లు కూడా వేరుగా నిరసన కార్యక్రమంలో దిగారు. బెటాలియన్ కమాండెంట్ తమ కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మరికొందరు ప్రత్యేక కానిస్టేబుళ్ల రోడ్లెక్కారు. ఇష్టానుసారంగా డ్యూటీలు వేసి కుటుంబాలకు నెలలతరబడి దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసారు. అసలు తాము పోలీసులమా? పనివాళ్లమా తెలియడంలేదని, వాగులోఇసుక, మిషన్ భగీరథ పైపులు తీసుకురావాలని కొందరు అధికారులు, గడ్డి శుభ్రం చేయాలని ఇంకొందరు ఇలా ఆదేశాలు జారీ చేస్తున్నారని వాపోయారు. తమకు కుటుంబాలను దూరం చేయవద్దని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న పోలీసు విధానాన్ని తెలంగాణలో అమలు చేయాలని అభ్యర్థిస్తూ బహిరంగంగానే ఒక కానిస్టేబుల్ కన్నీటితో ఉన్నతాధికారి కాళ్లపై పడివేడుకున్నాడు. ప్రత్యేక కానిస్టేబుళ్లే కాదు, సివిల్, ఎఆర్ తదితర విభాగాల్లో కొందరు కానిస్టేబుళ్లు, హోంగార్డులు పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీకావు. బయటకు చెప్పుకో లేని పరిస్థితి. ఆనాటి బ్రిటిష్ పాలకులు ప్రవేశపెట్టిన ఆర్డర్లీ వ్యవస్థలో మగ్గిపోతున్న కానిస్టేబుల్స్ ఎందరో ఉన్నారు. గత యేడాది సెప్టెంబరులో ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న ఒక హోంగార్డు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోగా టిపిసిసి అధ్యక్షుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హోంగార్డుల సమస్యలకు పరిష్కారచర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. వెట్టికి మారుపేరుగా కొనసాగుతున్న ఈ విష సంస్కృతిని కొందరు కానిస్టేబుల్స్ వారి కుటుంబాలు జీర్ణించుకోలేకపోతున్నారు. క్రమశిక్షణ పేరుతో నోటికి కుట్లువేసుకొంటున్నారు. మరొకపక్క చాలీచాలని జీతాలతో పనిభారంతో అవమానాలతో కృంగిపోతున్న హోంగార్డులు కూడా నిరసనలకు సమాయత్తం అవుతున్నట్లు సమాచారం. గతంలో కూడా హోంగార్డులు రోడ్లెక్కిన సంఘటనలున్నాయి. క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న పోలీస్ శాఖలో కానిస్టేబుళ్ల ప్రత్యక్ష ఆందోళనకు దిగారంటే వారు ఎంతటి మానసిక సంక్షోభానికి గురై ఉంటారోఊహించుకోవచ్చు. ఈ సంస్కృతి పోలీస్ శాఖలో ఇప్పటికిప్పుడు మొదలైంది కాదు. ఏనాటి నుంచో కొనసాగుతున్నది. అప్పుడప్పుడూ ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు కమిటీలు వేయడం విచారణ చేయించడం, చర్యలు తీసుకుంటామని చెప్పడం ఈ విషసంస్కృతిని రద్దుచేస్తున్నట్లు ప్రకటించడం సర్వసాధారణమైపోయింది. ఆర్డర్లీ వ్యవస్థ అన్నా మరే పేరుతో పిలిచినా బ్రిటిష్ కాలం నుండి ఒక్క పోలీస్ శాఖలోనే కాదు మరికొన్నిశాఖల్లో కూడా ఈ దుస్సాంప్రదాయం కొనసాగుతున్నది. ఎన్నోసార్లు పాలకుల దృష్టికి వచ్చింది. 1979లో ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి ఈ వ్యవస్థను రద్దుచేస్తూ సెప్టెంబరు 19వ తేదీన (జి.ఒ.నెం.612) ఉత్తర్వులు జారీ చేసారు. ప్రత్యామ్నాయంగా ఈ ఆర్డర్లీ వ్యవస్థను ఉపయోగించుకుంటున్న అధికారులకు కాంపెన్సేటరీ అలవెన్సుకింద అదనంగా కొంత డబ్బు ప్రభుత్వం చెల్లించే విధంగా నిబంధనలు రూపొందించారు. తాత్కాలికంగా రెండుమూడు నెలలపాటు ఆ వ్యవస్థ ఆగిపోయినా ఆతర్వాత యధాతథంగా కొనసాగింది. కొందరు అధికారులైతే అదనంగా మంజూరు చేసిన అలవెన్సు తీసుకుంటూనే ఆర్డర్లీని ఉపయోగించుకోవడం కూడా ప్రారంభించారు. దీనితో అటు డబ్బు పోతున్నది, ఇటు ఆ వ్యవస్థను నియంత్రించలేకపోవడంతో 1988 అక్టోబరు 31న కాంపెన్సేటరీ అలవెన్సును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీచేసారు. ఆ అలవెన్సును నిలిపివేయడంతో ఆర్డర్లీలను నియమించుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లయింది. దీనితో వ్యవస్థ విచ్చలవిడిగా పెరిగిపోయింది. ఎన్నిసార్లు పాలకులు పదేపదే హెచ్చరించినా ఆర్డర్లీ వ్యవస్థను మాత్రం రూపుమాపలేకపోయారు. గతంలో అంతగా చదువుకున్నవారు ఈ పోలీస్ కానిస్టేబుల్ వ్యవస్థకు రావడానికి ఇష్టపడేవారు కాదు. కానీ ప్రస్తుతం నిరుద్యోగ రక్కసి ప్రబలి మరో జీవనాధారంలేక ఇదే పదివేలు అనుకుంటూ హోంగార్డు ఉద్యోగాలకు కూడా డిగ్రీ చదివినవారే కాదు పోస్టుగ్రాడ్యుయేషన్ చదివిన వారు కూడా వస్తున్నారు. అలాంటి వారితో ఇలాంటి పనులు చేయించడం ఎంతవరకూ సమంజసమో ఒక్కసారి ఆలోచించాలి. బ్రిటిష్‌వారు ఆనాడు ఏమిచేయించారో ఏమో కానీ కొందరు అధికారులు కానిస్టేబుళ్ల తో చేయిస్తున్న పనులు వారినోటి నుంచే వింటుంటే ఆవేదనే కాదు ఆందోళన కూడా కలుగుతుంది. కానిస్టేబుల్స్‌గా శిక్షణ ఇవ్వడానికి లక్షలాది రూపాయలకుపైగా వెచ్చిస్తున్నారు. నెలలపాటు ఆయుధాల వినియోగం శాంతిభద్రతల పర్యవేక్షణ తదితర అంశాలపై పూర్తి తర్ఫీదునిస్తున్నారు. లక్షలు వెచ్చించి నెలలపాటు శిక్షణ ఇచ్చి సంఘ విద్రోహశక్తులు, అరాచక శక్తులపై తుపాకులు ఎక్కుపెట్టాల్సిన చేతులతో ఇసుక మోయించడం, గడ్డి పీకించడం లాంటి పనులు చేయించడం ఎంతవరకూ సమంజసమో ఒక్కసారి మనసు పెట్టి ఆలోచించాలి. అంతచదువు చదివి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నవారు ఆత్మాభిమానం చంపుకుని ఇలాంటి పనులు చేయాల్సిరావడంతో వారు పడుతున్న మనోవేదన అంతా ఇంతా కాదు. పై అధికారులను చూసి సిఐ, ఎస్ఐలు లాంటి కిందిస్థాయి అధికారులు కూడా కానిస్టేబుళ్లు, హోంగార్డులతో ఇంటిపనులు చేయిస్తున్నారు. అధికారులందరూ ఇలాగే ఉన్నారని చెప్పడంలేదు. కుటుంబ సభ్యులు మాదిరిగా చూసుకుంటున్న అధికారులు కూడా లేకపోలేదు. కానీ అటువంటి అధికారుల సంఖ్య తక్కువే. అంగరక్షకుల వ్యవస్థ కూడా అలాగే తయారవుతున్నదేమోనని పిస్తున్నది. పోలీస్ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్నదేమోనన్న ఆవేదన కలుగుతున్నది. కొందరు అంగరక్షకులు తాముచేయాల్సిన విధులను పక్కనపెట్టి, కాఫీ, టీలు అందించే సేవకులుగా మారిపోయారు. నాయకుల వ్యక్తిగత పనులకు పరిమితం అవుతున్నారు. నాయకులకు కూడా గన్‌మెన్ పెట్టుకోవడం ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. కొన్నిచోట్ల గన్‌మెన్‌ల రక్షణలోనే చతుర్ముఖ పారాయణం కూడా జరుగుతున్నట్లు సమాచారం. అసలు ఈ గన్‌మెన్‌లను మూడునెలలకోసారి మార్చాలన్న నిబంధనలున్నా ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోతున్నారు. కొందరు గన్‌మెన్‌లకు శిక్షణ లేకపోవడంతో తుపాకీ పేల్చడం కూడా మరిచిపోయుంటారేమోననిపిస్తున్నది. ఒక సిఐనో, డిఎస్పీనో చివరికి ఎస్పీనో బదిలీ చేయించగలుగుతారేమోకానీ గన్‌మెన్‌ను ఆ నాయకుడి నుంచి బదిలీ చేయడం అంత సులభం కాదు. కొందరు గన్‌మెన్‌లు పైరవీకారులుగా మారిపోయారనే ఆరోపణలను కొట్టివేయలేం. ఆ నాయకుడితో పనులుంటే గన్‌మెన్ ద్వారా సంప్రదించే ఒరవడి పెరిగిపోతుండడం కూడా ఆందోళన కలిగిస్తున్నది. గన్‌మెన్‌ల వ్యవస్థపైకూడా సమగ్రమైన అధ్యయనం చేయించి అవసరమున్న చోట భద్రత కల్పించాలి. నిబంధనల ప్రకారం ఎంతటి వారినైనా మారుస్తుండాలి. నాయకుల రక్షణకు అంగరక్షకులను నియమించే విషయంలో నాయకుల అభీష్టం మేరకు కాకుండా నిబంధనలమేరకు జరగాలి. అయితే గన్‌మెన్ చేస్తున్నది వెట్టిచాకిరీ కింద జమ కట్టకపోయినా బయటకు కనిపించేది అలాగే ఉంది. అయితే వారు ఇష్టపడి చేస్తుండొచ్చు. కానీ అది పోలీస్ ప్రతిష్టను మంటగలుపుతున్నది. ఇకపోతే పోలీస్ శాఖలోనే కాదు ఇతర ప్రభుత్వ విభాగాల్లో కూడా ఈ ఆర్డర్లీ వ్యవస్థ ఏదోఒక రూపంలో కొనసాగుతూనే ఉన్నది. కొందరుఐఎఎస్ అధికారులు అటవీశాఖ అధికారులు, ఎక్సైజ్ అధికారుల్లో కూడా ఈ జాడ్యం పెద్దఎత్తునే ఉన్నది. ఇంజినీరింగ్ విభాగంలో ఉన్నతాధికారుల ఇళ్లల్లో ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుని ఇంటి పని, వంటపని సేవలందించేవారు కూడా ఉన్నారు. ఈ ఆర్డర్లీ అనే పేరు అన్నిశాఖల్లో లేకపోయినా ఏదో ఒకరూపంలో కొనసాగుతూనే ఉంది. దీన్ని కూకటివేళ్లతో ఎత్తివేయాలి. వారు సాటి మానవులే అన్న విషయాన్ని ఎప్పుడూ విస్మరించ రాదు. అందరిలాగే వారికి ఆత్మ గౌరవం ఉంటుంది. దానికి భంగం కలగకుండా కాపాడుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత పాలకుల కనీస కర్తవ్యం. ●

## ఒక్క మాట

# లీగల్ లిటరసీని పెంపొందించుకోలేమా!

**బి.మధుపాలి**

భారత దేశవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చేసిన లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆక్ట్ 1987 తీసుకురావడం జరిగింది. ఈ చట్టం 09 నవంబర్ 1995 నుంచి అమలులోకి రావడంతో ఆరోజు ప్రత్యేకతను గుర్తించిన ప్రభుత్వం ప్రతి యేటా 09 నవంబర్‌న జాతీయ న్యాయ సేవల దినం లేదా నేషనల్ లీగల్ సర్వీసెస్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ఈ చట్టం ద్వారా జాతీయ స్థాయిలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ లేదా జాతీయ న్యాయ సేవల అథారిటీ, రాష్ట్ర స్థాయిలో హైకోర్టు ప్రధానన్యాయమూర్తి నాయకత్వంలో రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ(స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ)', జిల్లా స్థాయిలోజిల్లా న్యాయ సేవల అథారిటీ(డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ)' ఆయా ప్రాంతాల బడుగు బలహీన వర్గాలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తూనే అవగాహన కార్యక్రమాలను నిర్వహించుట జరుగుతున్నది. న్యాయ దేవత, చట్టం ముందు అందరూ సమానమే. ఉన్నవారికి ఒకన్యాయం, లేని వారికి మరో న్యాయం అందుకున్న అకాలమిది. చేసే వారికి తగు శిక్షలు తక్షణమే పడాలి. న్యాయం కావాలని కోర్టులో కేసులు పట్టడం చాలా ఖర్చుతో కూడుకున్న అంశం అని మనందరికీ తెలుసు. న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కలేదని నిరుపేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచితంగా న్యాయం అందించడం, న్యాయ సంబంధ అవగాహనలు నిర్వహించడం, మైనారిటీ/ఎస్‌సి/ఎస్టీ/మహిళలు/పిల్లలు/మానవ అక్రమ రవాణా విషవలలో చిక్కిన వారికి ఉచితంగా న్యాయ



సేవలు లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా అందించడం జరుగుతోంది. న్యాయ హక్కుల పట్ల సరైన అవగాహన లేని సమాజంలో మనం ఉన్నాం. పేదలకు సైతం న్యాయమైన హక్కులు అనుభవించే అవకాశం ఇవ్వడమే న్యాయ సేవల అథారిటీ లక్ష్యంగా తీసుకోబడింది. క్షేత్రస్థాయిలో లోక్ అదాలత్‌లను నిర్వహిస్తూ, సమస్యలకు పరిష్కారాలు అక్కడికక్కడే అందించే ప్రయత్నాలు ఈ అథారిటీల ద్వారాజరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా సుప్రీం కోర్టు స్థాయిలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైకోర్టుల పరిధిలో 39 హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 37 స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 673 డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 2465 తాలూకా స్థాయి లీగల్ సర్వీసెస్ అథారిటీలు ఉచిత న్యాయ సేవలను బలహీన వర్గాలకు అందిస్తున్నాయి. లీగల్ సర్వీసెస్ అథారిటీల ద్వారా ఉచిత న్యాయ సేవలు, లీగల్ రైట్స్ పట్ల అవగాహనలు, న్యాయన్ని వేగంగా అందించడం, పేదలకు న్యాయ సేవలు అందుబాటులోకి రావడం, కోర్టుమెట్లు ఎక్కకుండానే న్యాయం పొందగలగడం, లోక్ అదాలత్‌లను నిర్వహించి సత్వరమే కేసులను పరిష్కరించడం లాంటి మహత్తర కార్యాలనున్యాయ సేవల అథారిటీలు నిర్వహిస్తున్నాయి. ఆర్థికంగా చితికిన బడుగుల చెంతకు న్యాయ సేవలు ఉచితంగా అందించబడాలి. చట్టం ముందు తరతమ భేదాలు ఉండకూడదు. కోర్టుల్లోకి చేరి దశాబ్దాలుగా కోర్టుల్లో కేసులు పొడిగించబడి కుటుంబాలు చితికి పోకూడదు. న్యాయం అందడానికి సమయం పట్టకూడదు. ఆలస్యంగా న్యాయం అందినా అది అన్యాయమే అవుతుందని గమనించి ఉచిత న్యాయ సేవలు అందిస్తున్న లీగల్ సర్వీసెస్ అథారిటీలను ఆశ్రయించి సత్వర న్యాయం పొందాలని ఆశిద్దాం, కోర్టు మెట్లెక్కని రోజులు రావాలి. ●

# 'సంగీత కళానిధి' కళాప్రపూర్ణుడు ఫిడేలు నాయుడు



యనమండ్ర వేంకట కృష్ణయ్య

పద్దెనిమిది వందల తొంభై మూడులో బెంగుళూరులో ఫిడేలు నాయుడుగారు ఒక జ్యోతి ఆవిర్భవించి మానవ గంధర్వుడుగా జన్మించాడు. బాల్యం విద్యాభ్యాసం ఇత్యాది విషయాలు కూడా ఆ వ్యక్తి విషయంలో చాలా సామాన్యం గా ఉన్నట్లు చరిత్ర ధృవీకరించింది. కానీ ఆవ్యక్తి ఒక నివురు గప్పిన నిప్పు అప్పుడు. సూర్యుడై ప్రతాపం చూపినాడు, చంద్రుడై అమృతాన్ని పంచిపెట్టినాడు. ఆ వామనుడే ద్వారం వెంకటస్వామినాయుడుగారు. వీరితండ్రి, తాతగారు వృత్తిరీత్యా మిలిటరీ వృత్తిలో ఉన్నప్పటికీ వాయులీన విద్వాంసులు, రామభక్తి, సంగీతాసక్తి కలిగినవారు. అటు వంటి కుటుంబములో జన్మించిన నాయుడుగారికి ఖచ్చితమైన లయ జ్ఞానము, గతితప్పని క్రమశిక్షణ జన్మతః సంక్రమించాయి. అయన ఒకటవ ఫారం చదువుతున్న రోజులలో కొన్నిసంఘటనలు జరిగాయి. దృష్టి లోపంవల్ల క్లాసులో బ్లాక్ బోర్డు మీద వ్రాసినది చూసి చదవలేక పోయినందుకు ఆయనను ఉపాధ్యాయుడు కఠినంగా శిక్షించారు. నాయుడుగారు ఆ విషయాన్ని అమ్మగారి దగ్గర మొరపెట్టుకొన్నారు. అదివిన్న తాతగారు బడిమాన్పిస్తే అన్నవెంకటకృష్ణయ్య ఇంటివద్ద సంగీత పాఠాలుచెప్పడం మొదలుపెట్టారు. తండ్రి గారితో పాటు చిన్నప్పటినుంచీ భజన పాటలుపాడుతూ, అన్నగారి ఫిడేలువాద్యం ఆసక్తితో వింటూ సంగీతంలో అభిరుచి పెంచుకున్న నాయుడుగారు ప్రాథమిక శిక్షణ ప్రమేయం లేకుండానే అద్వితీయమైన కఠోర సాధనతో కృషిని మొదలుపెట్టారు. దీపావళి నాడు పుట్టిన నాయుడుగారు తమ విద్యను దేదీప్యమానంగా ప్రకాశింపచేసుకొని, తమ కంటికీ ఇంటికీ వెలుగు తెచ్చి వారుకూడా వెలుగులోనికి వచ్చారు. యుక్త వయస్సులో ఉన్న నాయుడుగారు సుమారు 1914 సంవత్సరం ప్రాంతంలో విశాఖపట్నంలో ఒక కార్యక్రమములో శ్రావ్యమైన వాయులీన కచేరీ చేస్తుంటే వారి సంగీత వైదుష్యాన్ని మెచ్చుకొని మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు అనే రసజ్ఞుడు, కవి ఒక బంగారపు ఉంగ రాన్ని నాయుడుగారి వేలికి తొడుగుతూ "ఫిడేలు నాయుడు" అని నామకరణంచేశారు. నాటి నుండి ఆ పేరు చరిత్రలో స్థిరంగా ఉండిపోయింది. పాశ్చాత్యులతో పాటు వారిసంగీతం కూడా మన దేశంలో ప్రవేశించింది. వారిబ్యాండు మెట్లూ, జంత్రవాద్యాలూ మన సంగీత వేత్తలని ఆకర్షించా యి. కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకరైన ముత్తు స్వామి దీక్షితులవారు ఇంగ్లీష్ నొట్లులతో కృతులు రచిస్తే వారి సోదరుడు బాలుస్వామి దీక్షితులవారు ప్రప్రథమంగా మన సంగీతానికి ఫిడేలు వాయిద్యాన్ని ఉపయోగించారు. నాటినుండి నేటిదాకా శాస్త్రీయ సంగీతంలో ఎందరెందరు ఆ ఫిడేలు వాయిద్యాన్ని చేతపట్టినా భారతదేశమంతటికి ఒకే ఒక్కరికి' ఫిడేలు నాయుడు గారు' అనే పేరు లభించడటం ఆంధ్రులకు గర్వ కారణం. తాను నేర్చి, ఏర్పరచుకొన్న బాణీ



ఫిడేలు నాయుడుగారు

సుస్థిరమయ్యేటందుకు ప్రతీరోజు సుమారు ఏడు గంటల పాటు పదకొండు సంవత్సరాలు కఠోరమైన క్రమశిక్షణ, దీక్షతో గతి తప్పకుండా సాధకం చేసి ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసుడుగా కచేరీలు చేస్తుండేవారు. వంశపారంపర్యంగా వచ్చిన మిలిటరీ మనస్తత్వపు లక్షణాలు కావలసిన మానసిక ధైర్యాన్ని, పట్టుదలను ఇచ్చాయి. అప్పటికి దక్షిణ దేశంలో సంగీత కళాశాలలు లేవు. విద్యలకు నిలయమైన విజయనగరంలో 1919లో ప్రప్రథమ సంగీతకళాశాలను మహారాజా వారు స్థాపించి 'హరికథా పితామహ' శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు మొదటిప్రిన్సిపాల్‌గా నియమించారు. అప్పటికే నాయుడుగారు చాలాప్రాంతములలో తమ వాయులీన్ విద్యను ప్రదర్శించిశ్రోతల మన్ననలు పొందుతూ ఉన్నారు. అయినప్పటికీ సంగీత కళాశాలలో చేరి మరింత ఉన్నత విద్యను అభ్యసించాలనేది వారి అభిలాష. కళాశాల ప్రారంభోత్సవం నాడు మహారాజావారి, నారాయణదాసు ఇతర ప్రముఖుల సమక్షంలో నాయుడుగారు కచేరి చేయడంతోపాటు రాజావారి కోటలో కూడా రెండు మూడు కచ్చేరీలుచేసి తన కళను ప్రదర్శించారు. వీరిప్రతిభను గుర్తించిన రాజావారు, దాసుగారు నాయుడు గారిని విద్యార్థిగా గాక నేరుగా వయోలిన్ అధ్యాపకులుగా నియమించారు. నారాయణదాసుగారు ప్రిన్సిపాల్‌గా పదవీవిరమణచేసిన అనంతరం ప్రధానాచార్యుడుగా బాధ్యతలు చేపట్టి మరోపద్దెనిమిది సంవత్సరములు వారి సేవలను అందించారు. వయోలిన్ వాయిద్యం కూడా టైపు, షార్ట్‌హ్యాండ్ లాంటిదని వారి అభిప్రాయం. నాలుగు రోజులుమానేస్తే ఆ రెండూ స్వాధీనంలో ఉండవు అందుకే నిత్యసాధన అనేవారు. ఒకానొక సందర్భంలో అన్న వెంకట కృష్ణయ్య తమ్ముడిని అమృత్సర్‌లో ఉన్న ప్రఖ్యాత నేత్ర వైద్యుని వద్దకు తీసుకువెళ్లాలని తలపెట్టారు. కానీ నాయుడుగారు దానికి అంగీకరించలేదు. కారణమేమని ప్రశ్నించగా "సంగీతానికి మనోనేత్రం అవసరం. బాహ్యనేత్రాలు నాకు లేకపోవడం నుంచి నా మనోనేత్రాన్ని నేను వికసించేటట్లుగా చేసుకోగలిగాను. నా సంగీతం కూడా పరిపక్వ దశకువస్తోంది. మన సంగీతం ఏకత్వాన్ని సూచిస్తుంది. అందుకే ఇది ఏకస్వర సంగీతం. దీనికి తపస్సు అవసరం. కన్నులు ఉండడంవల్ల చూపులు బుద్ధికి చంచల్యాన్నికలిగిస్తాయి. ఏ వైద్యుడైన నాకిప్పుడు కన్నులు ప్రసాదిస్తే నా మనోనేత్రం భగ్నమైనా సంగీతానికి ముప్పురావచ్చు. అందుచేత నా సంగీతంకోసం నేనునా బాహ్యనేత్రాలను సమర్పించుకో దలచుకున్నాను" అని అన్నారు నాయుడుగారు. ఆంధ్ర, తమిళ, కన్నడ సంగీత ప్రియులను ఒక్కటిగా కలిపినకర్ణాటక సంగీతంలాగ కన్నడనాడులో పుట్టి, తెలుగునాట మనుగడ గడిపి, తమిళ నాడులో స్థిరపడి సుమారు అర్థశతాబ్దిపాటు సంగీత ప్రియు లకు వయోలిన్ వాదనలో వరప్రసాదిత నిపుణతో, అందచందాల పరిశీలనతో అపాకృతం, అనిర్వచనీయం అయిన ఆత్మానందం చేకూర్చి అనేకానేకబిరుదులూ, అఖండ సన్మానాలు పొందిన నాయుడుగారు 1964 నవంబర్ 25వతేదీన తుదిశ్వాస వీడి వైకుంఠనాథుని ఒడికి చేరుకున్న సంగీత ప్రియ హృదయాలలో సదాచిరస్మరణీయుడు. మహోన్నత వ్యక్తికి జాతిఏమిస్తే ఋణం తీర్చుకోగలదు. ●

# ప్రజావాక్కు



### వాడలెత్తిస్తున్న మైనర్ల డ్రైవింగ్

ఈ మధ్య కాలంలో స్కూల్ పిల్లలు, మైనారిటీ తీరని ఇంటర్మీడియట్ చదివే పిల్లలు సైతం ఎస్. యూవీ వంటి అత్యంత వేగవంతమైన బైకులు, కార్లు నడుపుతున్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల పట్ల ఎలాంటి అవగాహన లేని పిల్లలు వాహనాలు తీసుకుని రోడ్డు ఎక్కితే చాలా నష్టం జరుగుతుంది. ఈనష్టంతో ఆ పిల్లల కుటుంబాలే కాకుండా సమాజంకూడా ఆ నష్టాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. తల్లిదండ్రులు, పెద్దలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు. అలాగే మోటారు వాహనచట్టాలకు రవాణా శాఖ గట్టి పదునుపెట్టాలి. ముఖ్యంగా మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 199ఏను సమర్థంగా అమలు చేసేలా అన్ని జిల్లాల ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం అధికారులకు దిశానిర్దేశంచేస్తే మునుముందు మైనర్ల డ్రైవింగ్‌ను అరికట్టేందుకు వీలు అవుతుంది.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### బంగారం ధరను నియంత్రించాలి

బంగారం ధర రోజు రోజు కూ పైకి ఎగబ్రాకుతోందే కాని కిందకు దిగనంటోంది. గ్రాము ధరఎనిమిది వేల రూపాయలు దాటిపోయింది. రాబోయే సంక్రాంతి నాటికి పదివేలకు చేరుకుంటుందని అంటున్నారు. బీద, మధ్యతరగతి కుటుంబాల వారికి ఈ పసిడి అందని ద్రాక్షే అవుతుందేమో. కనీసం వివాహాలలో ముఖ్యమైన తాళిబొట్టు కూడా చేయించలేని దుస్తితి దాపురిస్తుందా? మన దేశంలో నున్న బంగారం మన భూభాగాన్నంతా తాపడం చేసేంత ఉన్నదట. మరెందుకు ఇంతగా దీని విలువ కొండలా పెరిగిపోతోంది? బహుశా ఈ పసిడి ముద్దలన్నీ కొందరిధనికుల భండాగారాల్లో నిక్షిప్తమై ఉన్నాయి! బంగారంధరను నియంత్రించే ఆలోచన చేయాలి.

-ఎన్. రామలక్ష్మి, సికిందరాబాద్

### సాంకేతిక దూర విద్య

ఇటీవల ఏపి రాష్ట్రప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులను ప్రముఖ ప్రభుత్వ పాల్‌టెక్నిక్‌లో ప్రైవేటుగావిద్యబోధనకు నిర్ణయించడంసముచితం. ఇదే విధంగా కొన్నిప్రముఖ కోర్సులను కూడా విశ్వవిద్యాలయాల్లో సాయంత్రం బోధన ఉండేట్లు ఏర్పాటుకు ప్రయత్నిస్తే ఉదయం ప్రైవేటు విధులు చేసే నిరుద్యోగులకు వారవుతారు. కేటాయించడం ద్వారా సాధ్యమవుతుంది.

-బొల్లోజు మేఘనాథ్, విశాఖపట్నం

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి!

రాష్ట్ర ఉన్నత విద్యామండలిలో రికార్డులు మాయమైనట్లు తాజాగా పత్రికల్లో వార్తలు వచ్చాయి. రాష్ట్రంలో అధికారం మారిన నేపథ్యంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులు దగ్ధం చేశారు. కేసులు నమోదు చేసినా బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు! ఇలాంటి సందర్భాల్లో అప్పుడు పనిచేసిన అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి సారించి తప్పు చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి. బిల్లులు లేకుండా లక్షల రూపాయలు డ్రా చేసుకుని రికార్డులు మాయం చేస్తే ప్రభుత్వం ఉదాసీనంగా ఉండకూడదు.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### సద్వినియోగం చేసుకోవాలి

హైదరాబాద్ నగరంలో ప్రస్తుతంనాంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లు ఉన్న సంగతి తెలిసిందే. కొత్తగా నగర శివార్లలోని చర్లపల్లి వద్ద రూ.415 కోట్ల పెట్టుబడితో కేంద్రం కొత్త రైల్వే టెర్మినల్ నిర్మించింది. సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ స్టేషన్లపై పెరుగుతున్న రైళ్ల సంఖ్యను, ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ప్రత్యామ్నాయ ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేసింది. త్వరలో ప్రారంభం కానున్న ఈ రైల్వే స్టేషన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకొని రైలు ప్రయాణాన్ని మరింత ఆనందమయంగా చేసుకోవాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### కులగణన ఇలా చేయాలి

ఒకప్పుడు సమాజంలో వ్యక్తుల వృత్తుల ఆధారంగా చేసుకుని జీవించేవారు. అలాజీవించేవారిని ఆ కులస్తులుగా పేర్కొనేవారు. ప్రస్తుతం కాలం మారింది. పల్లెల్లో పట్టణాలలో విద్యా వ్యవస్థ పెంపొంది కుల వృత్తులు క్షీణించాయి. చదువుకుని ఉద్యోగం చేసుకుంటున్నా వారి తరువాత తరం వారు కూడా చదువుకుని ఉద్యోగ వ్యాపారాలలో స్థిరపడుతున్నారు. కేవలం కొందరు మాత్రమే ఇంకా కులవృత్తులు చేసుకుని జీవిస్తున్నారు. మరి అటువంటి తరుణంలో ఏ విధంగా కులగణన చేస్తారు. కుల వృత్తుల ఆధారంగా కులాలు పుట్టాయి. ఇప్పుడు కుల మతాలకు అతీతంగా నేడు అందరూ అన్ని రకాల వృత్తి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కావునా ప్రభుత్వంకేవలం కులవృత్తులు చేస్తున్నవారిసి గుర్తించివారికి తగిన ప్రోత్సాహాన్ని అందివ్వాలి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ



## ప్రతి కుటుంబం, పౌరుల అవసరాలు తెలుసుకోవడానికి కుటుంబ సమగ్ర సర్వే

### సమగ్ర సర్వేను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ఖమ్మం బ్యూరో నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వే కి కుటుంబ సమగ్ర సర్వే చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, ఖమ్మం రూరల్ మండలం కోట నారాయణపురం గ్రామంలో కుటుంబ సమగ్ర సర్వే ప్రక్రియను ప్రారంభించారు. గ్రామంలోని షేక్ ఇస్మాయిల్ ఇంటికి వెళ్లి, సమగ్ర సర్వే ప్రారంభించారు. సర్వే లో సూచించిన ప్రశ్నలు అడిగి, నమోదు చేయించారు. మరింత అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక రచనకు సర్వే అని, ఎటువంటి అపోహలు లేకుండా సర్వేకు ప్రజలు సహక రించాలని మంత్రి అన్నారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి కుటుంబం, వార్డు, గ్రామం, నియోజకవర్గ, జిల్లా సమగ్ర సర్వే చేపట్టితే, ఏ వర్గానికి ఏం కావాలో తెలుస్తుందని, ప్రభుత్వానికి ఆ దిశగా చర్యలకు అవకాశం కలుగుతుందని అన్నారు.

సమగ్ర సర్వే మొక్కుబడిగా కాక, క్షుణ్ణంగా చేయాలనే తలంపుతో ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుందని మంత్రి తెలిపారు. 75 కాలంలతో కుటుంబ సర్వే చేపట్టడం జరుగుతుందని, దీనివల్ల కులం, మతం అన్నదాని కంటే, సమాజంలో ప్రతి కుటుంబం/పౌరునికి ఏ అవసరాలు ఉంటాయో, ఏ ప్రాంతానికి, ఏ ఊరికి ఏం అవసరాలు ఉన్నాయో పూర్తిగా తెలుస్తుందని, తద్వారా పరిష్కారానికి మార్గం చూడొచ్చని మంత్రి అన్నారు. జిల్లాలో 536335 కుటుంబాలను గుర్తించినట్లు, ఇండ్ల జాబితా పూర్తితో వీటి సంఖ్య పెరగవచ్చని అన్నారు. ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేషన్ బ్లాక్ గా చేపట్టినట్లు, మొత్తం 3654 ఎన్యుమరేషన్ బ్లాకులుగా చేసి, 3810 మంది ఎన్యుమరేటర్లు, ప్రతి 1015 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్వైజర్ చొప్పున 317 మంది సూపర్వైజర్లు, ప్రతి నియోజకవర్గానికి ఒక సీనియర్ అధికారిని ఇంచార్జి గా, ప్రతి మండలానికి జిల్లా అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించినట్లు మంత్రి అన్నారు. ఏరోజుకారోజు చేపట్టిన సర్వేని కంప్యూటర్ లో ఫీడింగ్ కు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. బడుగు, బలహీన, దళిత, గిరిజన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి అన్నారు.

దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలపాలని, అధికారులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయమే కాక, బాధ్యతగా నిర్వర్తించాలని, ఏ చిన్న పొరపాటు, తప్పిదం జరగకుండా పూర్తి పారదర్శకంగా పూర్తి చేయాలని మంత్రి తెలిపారు. ఈ సందర్బంగా ఎన్యుమరేటర్లకు మంత్రి సర్వే కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, మండల ప్రత్యేక అధికారిణి/జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, నియోజకవర్గ అధికారి/అదనపు డిఆర్డీవో నూరొవుద్దీన్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడిఓ కుమార్, ఎంఇఒ శ్రీనివాసరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయాలకతీతంగా సమగ్ర సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### తప్పుడు సమచారమిస్తే కఠినచర్యలు

### తెలంగాణ బిసి కమిషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేకి ప్రజలందరూ సహకరించాలని.. రాజకీయ పార్టీలు కూడా రాజకీయాలకతీతంగా సహకరించాలని తెలంగాణ బీసీ కమిషన్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. బీసీ కమిషన్ శుక్రవారం హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో నప్రత్యేకంగా సమగ్ర సర్వే కొనసాగింపుపై సమావేశమైంది. సమగ్ర కులాల సర్వే ఎటువంటి అనుమానాలు లేకుండా ప్రశాంతంగా జరిగేలా.. మంచి వాతావరణాన్ని సృష్టించడానికి అందరూ ప్రయత్నించాలని... అన్ని రాజకీయ పార్టీలు.. రాజకీయ విభేదాలకు అతీతంగా సహకరించాలని పేర్కొంది. బీసీ కమిషన్ దగ్గర సొంతంగా యంత్రాంగం, సిబ్బంది లేనందున ఈ సమగ్ర సర్వేను ఒక ప్రభుత్వ శాఖకు అప్పగించాలని బీసీ కమిషన్ కోరడంతోనే ప్లానింగ్ శాఖకు ప్రభుత్వం అప్పగించడం జరిగిందని తెలిపింది. ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సమగ్ర కులాల సర్వే ఎటువంటి లోపాలు లేకుండా ప్లానింగ్ శాఖ ప్రయత్నించాలని బీసీ కమిషన్ కోరింది. ఎన్యుమరేటర్స్ ఏ రోజు, ఏ ప్రాంత కుటుంబాలకు వెళతారో స్పష్టంగా ముందస్తు ఆ కుటుంబాలకు సమాచారం అందించే విధంగా.. సూపర్ వైజర్‌లు, పై అధికారులు ప్రయత్నించాలని.. కనీసం ఒకరోజు ముందే ఆ సమాచారాన్ని ప్రజలకు అందించాలని సూచించింది. ప్రజలు కూడా పూర్తి సమాచారాన్ని అందిస్తేనే బీసీల అసలు సంఖ్య, విద్య, ఆర్థిక, సామాజిక, రంగాలలో ఉన్న వెనుకబాటుతనం తెలుస్తుందని ప్రకటించింది.

ఎన్యుమరేటర్ల ద్వారా సేకరించిన వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచడానికి ప్లానింగ్ శాఖ, కలెక్టర్లు అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ప్లానింగ్ శాఖ సేకరించిన ఈ సమాచారం బీసీ కమిషన్‌కు అత్యంత కీలకమని.. ఈ సమాచారాన్ని సమీక్షించి భవిష్యత్తులో తీసుకోవలసి నటువంటి చర్యలు, సూచనలు గురించి ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపింది. సమాచార సేకరణకు వచ్చే ఎన్యూమరేటర్లకు అన్ని విధాల సహకరించాలని కోరింది. ఎక్కడైనా, ఎవరైనా అధికారులు గానీ ఎన్యుమరేటర్లు కానీ ప్రజలు కానీ తప్పుడు సమాచారాన్ని నమోదు చేస్తే వారిపై చట్టబద్ధమైన చర్యలు ఉంటాయని బీసీ కమిషన్ ప్రకటించింది.

## ఆస్పత్రులపై డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు

### అనుమతులు లేకుండా నిల్వచేసిన నార్కోటిక్స్ సీజ్

### త్వరలో రాష్ట్రవ్యాప్తంగా దాడులు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** అనుమతి లేకుండా నార్కోటిక్ డ్రగ్స్‌ను నిల్వచేసిన ఆసుపత్రులపై డ్రగ్ కంట్రోల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. శుక్రవారం రాజధాని హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రులపై దాడులు నిర్వహించి నార్కోటిక్ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. అక్రమంగా మందులు నిల్వచేసి అమ్ముతున్నారన్న ముందస్తు సమాచారం మేరకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి పలు ఆసుపత్రులపై దాడులు నిర్వహించారు. హైదరాబాద్ పాతబస్తీ చాంద్రాయణగుట్ట, వారాసి గూడలో నిర్వహించిన తనిఖీలలో పెద్ద ఎత్తున మందుల అక్రమ నిల్వలు బయటపడ్డాయి. ఆసుపత్రి యాజమాన్యాలు ఎటువంటి అనుమతి లేకుండా పలు రకాల మందులను నిల్వ చేసి అమ్ముతున్నట్లు గుర్తించారు. ఈ జాయింట్ ఆపరేషన్‌లో ఫెంటానిల్, కెటామైన్, మిడాజోలం ఇంజెక్షన్లతో పాటు నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల భారీ నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై చార్మినార్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్, ముషీరాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఇందులో తదుపరి విచారణ జరిపి నేరస్తులందరిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ అడ్మి నిస్ట్రేషన్ డిజీ విబి కమలాసన్ రెడ్డి తెలిఆపరు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులలోనూ తనిఖీలు చేయకపోవడం వల్ల విచ్చలవిడిగా నార్కొటిక్స్ విక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రులపై దాడులు చేసిన నేపథ్యంలో త్వరలోనే డ్రగ్ కంట్రోల్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా దాడులకు సమాయత్తం

## కుటుంబ సర్వేకు ఆటంకాలు సృష్టిస్తే కఠినచర్యలు

### మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 8:** తమ అధినేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక సమగ్ర కుటుంబసర్వేకు ఆటంకాలు కల్పించినా, ప్రజల్లో అపోహలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హెచ్చరించారు.

గత ప్రభుత్వం చేయించిన కుటుంబ సర్వే వివరాలు ఉండగా ప్రత్యేకంగా మళ్లీ ఎన్యూమరేషన్ అవసరమా అని బీఆరెస్ నేతలు ప్రశ్నిస్తున్నారని, ఆ వివరాల మదింపు అప్పటి పాలకులు కోరుకున్న విధంగా జరిగిందని శుక్రవారం నాడు ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. సామాజిక, ఆర్థిక, విద్య, సమగ్ర కులగణన అనగానే గులాబీ, కమలం పార్టీలు ఆందోళన చెందుతున్నాయని, బలహీన వర్గాలకు న్యాయం జరగరాదన్నదే ఆ పార్టీల అభిమతమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 2011 తర్వాత పదేళ్లలో, 2021 లో జనాభా లెక్కలు సేకరించాల్సి ఉండగా మూడేళ్లయినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాటవేస్తోందని శ్రీధర్‌బాబు అన్నారు.

అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం, రాజకీయ ప్రాధాన్యత, ఆర్థిక తోడ్పాటు అందించడానికే కుటంబ సర్వే చేపడుతున్నామని ఆయన వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మేలు జరిగే ఈ ఎన్యూమరేషన్ ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ఆరెండు పార్టీలు ప్రజలకు జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ ఫలాలు అందరికీ చేర్చాలనే ప్రభుత్వ ఆశయాన్ని గుడ్డిగా ఎందుకు తప్పు పడుతున్నారని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. పింఛన్లు, రేషన్ కార్డులు తొలగించడానికే వివరాలు సేకరిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో ప్రజలకు తెలుసునని ఆయన వెల్లడించారు.

గణన తర్వాత అర్హత ఉన్నా సామాజిక ప్రయోజనాలు అందని వారికి మేలు జరుగుతుందని తెలిపారు. కులగణను స్వాగతించి, హర్షం వ్యక్తం చేస్తే మీకు రాజకీయ మనుగడ ఉంటుందని ఆయన బీఆరెస్, బీజెపీ పెద్దలకు సూచించారు. ఎన్యుమరేషన్ జరిగే సమయంలో ప్రజలు ఇళ్లవద్దే ఉండి సహకరించాలని కోరారు.

## సెలవులో వెళ్లమన్నారు.. ములుగు బాధ్యతలు ఇచ్చారు!

### ఆశ్రితులకు అదనపు బాధ్యతలు

### నీటిపారుదల శాఖలో పోస్టింగ్‌ల్లో ఇంజినీర్ అధికారుల్లో అసంతృప్తి

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** నీటి పారుదల శాఖలో ఆశ్రితులకు అదనపు బాధ్యతలు ఇస్తున్నారు. అదనపు బాధ్యతలు ఇచ్చేప్పుడు వారు పనిచేసే ప్రదేశానికి అదనపు బాధ్యతలు నిర్వహించే చోటుకు దూరం కూడా లెక్క చూసు కోకుండా ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. నైరుతి రుతుపవన కాలంలో మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులు డిస్ట్రి బ్యూటర్లు, కాలువలు గండ్లుపడి ఇతర మరమ్మతులకు నోచుకున్న సమయంలో నీటిపారుదల శాఖ ములుగు, వరంగల్, హైదరాబాద్, మంచిర్యాల, వనపర్తి, ఖమ్మం, సిడిఓ డిజి వాలంతరి, జాయింట్ సెక్రటరీ వంటి పోస్టింగ్‌లు అడ్డదిడ్డంగా ఒక పద్ధతి లేకుండా పైరవీలకు పట్టం కడుతూ ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓవైపు ప్రాజెక్టుల నిర్మాణం మరోవైపు ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాలలో అనేక లొసుగులు జరుగుతున్నా అర్హులను పక్కనబెట్టి కొంత మందికి అందులో కొన్ని సామాజిక వర్గాల వారికి మాత్రమే ప్రధాన పోస్టులు ఇస్తూ మిగితా వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ ఇంజనీర్లలో చర్చ జరుగుతోన్నది. సీతామారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్ టెండర్ విషయంలో గొడవపడ్డ కొత్తగూడెం సిఇని, ఇఎన్‌సి జనరల్ విషయంలో ప్రభుత్వం ఓవైపు సీరియస్ మరోవైపు వారిపై చర్యలు తీసు కోకపోగా అదనపు బాధ్యతల తాయిలాలు ఇస్తున్నారని నీటిపారుదల శాఖలో చర్చించుకుంటున్నారు. కొత్తగూడెం సిఇ కి ములుగు అదనపు బాధ్యతలు ఇటీవలే ఇవ్వడంతో ఇంజనీరింగ్ అధికారుల్లో చర్చ కొనసాగుతోన్నది. మంత్రుల ముందే వాదులాడుకున్న కొద్దిరోజులకే లీవులో వెళ్లమని మంత్రి మౌఖికంగా చెప్పినా కూడా సదరు అధికారికి అదనపు బాధ్యతలు ఇవ్వడం ఏమిటని చర్చించుకుంటున్నారు. సంగారెడ్డి సిఇ కె.ధర్మకు హైదరాబాద్ సిఇగా అదనపు బాధ్యతలు ఇచ్చారు.

వనపర్తి, వరంగల్, వాలంతరి డిజి పోస్టులో సంబంధంలేని వారికి పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ సమీపంలోని అర్హులను పక్కపెడుతన్నారని జలసౌధలో అధికా రులు అసంతృప్తి చెందుతున్నారు. టిఎస్ రవి కుమార్ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌ను భద్రాచలం ఇరి గేషన్ సర్కిల్‌కు బుచ్చిరెడ్డిని క్వ్యాసిఅండ్ఐ ఎస్ఇగా జగదేవ్‌పూర్ ఇఇని గజ్వేల్ ఇఇగా ఎప్ ఎసి ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు.



ప్రజావాణికి వచ్చిన లబ్ధిదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న డా.చిన్నారెడ్డి తదితరులు

## ప్రజావాణికి అందిన దరఖాస్తులు 471

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 8, ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 471దరఖాస్తులు అందాయి. వీటిలో బిసి సంక్షేమ శాఖకు సంబంధించి 156 దరఖాస్తులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 87 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 75 దరఖాస్తులు, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 50దరఖాస్తులు, ప్రవాసీ ప్రజా వాణికి సంబంధించి 4 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 99 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## టెట్-2024-2కు మొదటిరోజు 775 దరఖాస్తులు

### టిజి టెట్-2024-25 దరఖాస్తు ప్రక్రియ షురూ

### జనవరిలో పరీక్షలు.. ఫిబ్రవరి 5న ఫలితాలు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రకటించినట్టుగానే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-2024 రెండో విడతకి నోటిఫికేషన్‌ను జారీ చేయగా.. దరఖాస్తు ప్రక్రియ ఎట్టకేలకు గురువారం రాత్రి సుమారు 11 గంటల తరువాత ప్రారంభమైంది. ఈ నెల 5వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని పాఠశాల విద్యాశాఖ ప్రకటించినప్పటికీ.. సాంకేతిక కారణాల వల్ల వీలుపడలేదని అధికారులు ప్రకటించారు. అయితే ఈ నెల 7 నుంచి వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తామని.. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని అధికారులు ప్రకటించారు. కానీ ఈ నెల 7(గురువారం) ఉదయం నుంచే అభ్యర్థులు ఆన్‌లైన్ లింక్ ఎప్పుడు అందుబాటులోకి తీసుకొస్తారా అని ఎదురు చూశారు. రాత్రి 10 గంటల వరకు కూడా ఆన్‌లైన్ లింక్ అందుబాటులోకి రాలేదు. చివరికి రాత్రి 10 గంటలకు ఆన్‌లైన్ లింక్‌ను దాంతోపాటు పూర్తిస్థాయి సమాచారాన్ని (ఇన్‌ఫర్మేషన్ బులెటెన్)ను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇకపై ప్రతి ఏడాది రెండుసార్లు టెట్‌ను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే ఈ ఏడాది టెట్-2024-1ను విజయవంతంగా పూర్తి చేసి.. ఆ తరువాత డీఎస్‌సీ నియామకాలను సైతం పూర్తి చేశారు. ఇప్పుడు టీజీ టెట్-2024-2 నోటిఫికేషన్‌ను జారీ చేశారు. టెట్-2కి ఇప్పటి వరకు 1227 మంది ఫీజు చెల్లించగా.. వారిలో 775 మంది తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. పేపర్-1కి 305 మంది ఫీజు చెల్లించగా.. వారిలో 214 మంది దరకాస్తు చేశారు. ఇక పేపర్-2కి సంబంధించి 678 మంది ఫీజు చెల్లిస్తే.. 431 మంది దరఖాస్తు చేశారు. రెండింటికి మొదటి రోజు 244 మంది ఫీజు చెల్లించగా.. వారిలో 130 మంది దరఖాస్తు చేశారు. గత టీజీ టెట్ పరీక్ష ఫీజు కంటే ఈ సారి పరీక్ష ఫీజును తగ్గించారు. గతంలో ఒక పేపరుకు రూ. 1000.. రెండు పేపర్లకు రూ. 2000గా ఉండేది. ఇప్పుడు దాన్ని ఒక పేపర్‌కి రూ. 750 గానూ.. రెండు పేపర్లకి రూ. 1000గా నిర్ణయించారు. ఈ ఏడాది మే నెలలో టెట్ రాసి అర్హత సాధించని వారు.. అర్హత సాధించీ.. స్కోర్ పెంచుకోవాలనుకునే వారు మళ్లీ పరీక్ష రాసే వారికి ఎటువంటి ఫీజు ఉండదని నోటిఫికేషన్‌లో ప్రకటించారు. ఇప్పుడు టెట్ పరీక్షలను జనవరి 1, 2025 నుంచి జనవరి 20, 2025 మధ్యలో సీబీటీ విధానంలో నిర్వహించి.. ఫలితాలు ఫిబ్రవరి 5న ప్రకటించనున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

## సమగ్ర కులగణన.. బిసిల జనగణన



కులగణన చైతన్యగీతం సిడిని ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, శ్యాం కుర్మా, లింగంగౌడ్, సమత, సుజాత, తారాకేశ్వరి తదితరులు

### జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

### సందేహాల నివృత్తికి వెంటనే టోల్‌ఫ్రీ నంబరు పెట్టాలి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), నవంబరు 8, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 6వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటికి సర్వే సమగ్ర కులగణన మన గణన మనందరి జనగణన అని, దీనిలో ప్రజలంతా భాగస్వాములై సామాజిక బాధ్యతతో యజ్ఞంగా, ఉద్యమ స్ఫూర్తితో పాల్గొని విజయవంతం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రవీంద్రభారతిలో కులగణన చైతన్యం ప్రత్యేక సిడి ఆవిష్కరణ, కులగణనపై అన్ని కుల సంఘాల నాయకుల అభిప్రాయాలు, వైఖరులపై మీడియా సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాజుల శ్రీనివాస్‌గౌడ్ బిసి కుల సంఘాల జెఏసి కన్వీనర్ బాలగోని బాలరాజ్‌గౌడ్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కనకాల శ్యాం కుర్మా, ఐలి వెంకన్నగౌడ్, సింగం నగేష్, జాజుల లింగంగౌడ్, మల్లికార్జున్ యాదవ్, పానుగంటి విజయ్, తారాకేశ్వరి, సమత యాదవ్, సుజాత తదితరులతో కలిసి సమగ్ర కులగణనపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా కోదాడ శ్రీను వ్రాసిన, జంగం రవీందర్‌గౌడ్ సమర్పించిన కులగణన చైతన్యం ప్రత్యేక గీతం సిడిని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కులగణన ద్వారా బిసి అస్థిత్వం, రక్షణ, ఆత్మగౌరవం, బిసిలకు రాజకీయ రిజర్వేషన్లు, ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా ఉపాధి తదితర ఎన్నో ప్రయోజనాలు న్నాయన్నారు. అయితే ఈ కులగణనపై కొన్ని రాజకీయ, బిసి వ్యతిరేక పార్టీలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ విషం కక్కుతున్నాయన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు, నాయకులు ఇప్పటికీ స్పందించకపోవడం దురదృష్టకరమని వాపోయారు. బిసిల కులగణన కోట్లాదిమంది ప్రజల ఆకాంక్ష, దీన్ని గౌరవించాల్సిన సామాజిక బాధ్యత అన్నిపార్టీలు, నాయకులపై ఉందన్నారు. వివిధ అపోహలు, అనుమానాలతో ప్రజలను సంగ్ధిధంలో నెట్టివేయవద్దని హితవుపలికారు. అగ్రకులాల చేసేకుట్రలో బిసిలు పావులు కావొద్దని, వేసేఎత్తులకు చిత్తుకావద్దని, మోసపోవద్దని, అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని బిసి కులాల ప్రజలను కోరారు. టోల్‌ఫ్రీ నంబరు పెట్టి ప్రజలకు అనుమానాలు, సమస్యలొస్తే నిష్ణాతులతో నివృత్తి చేయాలని ప్రభుత్వాన్ని జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. అనంతరం బాలరాజ్‌గౌడ్ తదితరులు ప్రసంగించారు.

## పొలానికి వెళ్లిన రైతు దారుణహత్య

### భయాందోళనలో తండావాసులు

**వెల్దండ, నవంబరు 8, ప్రభాతవార్త:** తన వ్యవసాయ పొలంలో సాగు చేసిన పంట పొలానికి కాపలాకు వెళ్లిన యువరైతును గుర్తు తెలియని దుండగులు దారుణంగా హతమార్చారు. వివరాల్లోకి వెళితే... వెల్దండ మండలం ఎంజీ తండాకు చెందిన రాత్లావత్ రాజు (30) రోజు మాదిరిగానే తన వ్యవసాయ పొలంలోని పంటకు అడవి పందుల నుంచి రక్షణగా వెళ్లిన రాజు శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమ యంలో గుర్తుతెలియని వ్యక్తులు తలపై బండరాయితో మోది దారుణంగా హతమార్చారు. సంఘటన స్థలాన్ని సీఐ విష్ణు వర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తిలు చేరుకొని పరిసరాలను పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి డాగ్ సా ్క్వడ్, క్లూస్‌టీంను రప్పించి వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి రాత్లావత్ వశ్య ఫిర్యాదు మేరకు తెలిపిన వివరాల ప్రకారం. గురువారం రాత్రి మృతుడు రాత్లావత్ రాజు, అతని భార్య భోజనం తర్వాత ఇద్దరు కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున రాత్లావత్ వశ్య మరో కుమారుడు లాలు వ్యవసాయ పొలం వద్ద రాజు మృతదేహాన్ని చూసి తన తండ్రికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. తండ్రి వ్యవసాయ పొలానికి వెళ్లి చూసే సరికి తలకు బలమైన గాయాలతో చనిపోయి ఉండటాన్ని గమనించారు. సంఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. పొలానికి కాపలానికి వెళ్లిన రైతు మృతి చెందడంతో తండా వాసులు భయాందోళనకు గురవుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. మృతుడికి భార్య హిమబిందు, ఒక కొడుకు, ఒక కుమార్తె ఉన్నారు.

## ఎసిబికి చిక్కిన వర్ని ఎస్ఐ

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా వర్ని మండల పోలీసుస్టేషన్ ఎస్ఐ కృష్ణకుమార్ పోలీసు స్టేషన్‌లోనే 20 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టు కున్నారు. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటన పోలీసు స్టేషన్‌లో కలకలం రేపింది. ఒక సివిల్ కేసులో బాధితుడి నుంచి కృష్ణ కుమార్ 20 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా దీనిపై ముందుగానే సమాచారం వున్న ఎసిబి అధికారులు ఒక్కసారిగా దాడిచేసి పట్టుకున్నారు. అనంతరం ఎస్ఐ కృష్ణకుమార్‌ను అరెస్టు చేసి లంచం డబ్బులు 20 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి పై బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 34 కింద కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. అనంతరం ఎసిబి అధికారులు ఎస్ఐ కార్యాలయంతోపాటు పోలీసు స్టేషన్‌లో, ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు.




ఎసిబికి పట్టుబడిన వర్ని ఎస్ఐ కృష్ణకుమార్

## ఎంపికైన 1,392 మంది జెఎల్స్‌కు నియామకపత్రాలు ఇవ్వాలి

### 55 రోజుల్లోనే డిఎస్సీ నిర్వహణ, నియామకాలు..

### తక్షణమే నియామకాలను పూర్తి చేయాలి

### ప్రభుత్వానికి ఎంపికైన అభ్యర్థుల విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్స్‌గా ఎంపికైన 1,392 మందికి వెంటనే నియామక పత్రాలను అందించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జేఎల్స్‌గా ఎంపికైన అభ్యర్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం(నవంబర్ 8) ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా వివిధ యూనివర్సిటీలకి చెందిన సెలెక్టెడ్ జేఎల్స్ శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీలో సీఎం జన్మదిన వేడుకలను నిర్వహించి.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ద్వారా ఎంపిక కాబడిన 1,392 జూనియర్ లెక్చరర్స్ తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించి.. సీఎంకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినట్టు.. జేఎల్స్‌గా ఎంపికైన ఉస్మానియా యూనివర్సిటీతోపాటువివిధ యూనివర్సిటీల చెందిన అభ్యర్థులు డాక్టర్ లింగా నాయక్, వేణు, రమేష్‌రెడ్డి, సుమన్, రాజశేఖర్, అబి షేక్, నాగరాజు, శ్రీనివాస్, అజయ్, నరేష్ తదితరులు తెలిపారు. జేఎల్స్‌గా ఎంపికైన అభ్యర్థులు మాట్లాడుతూ టీజీపీఎస్సీ ద్వారా 15 యేళ్ల తర్వాత విద్యాశాఖలోని ఇంటర్మీడియట్‌కి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 1,392 జూనియర్ లెక్చరర్స్ పోస్టులకు 2022లో నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి 2023 లో రాత పరీక్ష నిర్వహించి.. 2024 జూలై లో మెరిట్ జాబితా ఇచ్చారని.. తరువాత తుది ఫలితాలను కూడా విడుదల చేశారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు తమకు నియమకపత్రాలు అందచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల్లోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ-2024 నిర్వహించి 55 రోజుల్లో నియామక పత్రాలు అందజేసిందని గుర్తు చేశారు. కానీ తమకు మాత్రం ఇప్పటి వరకు 1392 మందికి జూనియర్ లెక్చరర్లుగా నియామక పత్రాలు అందజేయలేదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి కొరకై.. ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ముందుంటామని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరగా తమకు నియామక పత్రాలు అందజేయాలని కోరారు. జేఎల్స్‌గా ఎంపికైన వారిలో ఎక్కువ మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారని.. ప్రభుత్వం వారికి వెంటనే నియామక పత్రాలు అందించి వారికి ఆర్థికంగా బలపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సైబర్ మోసం.. సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ

### మొబైల్‌కు ఇలాంటి లింక్ వస్తే క్లిక్ చేయొద్దు

### ఓటిపి చెప్పొద్దంటున్న పోలీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 8:** తెలంగాణలో సరికొత్త సైబర్ ఫ్రాడ్‌కు నేరగాళ్లు తెరలేపారని పోలీసులు చెబుతు న్నారు. మూడు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వేను తమకు అనుకూలంగా మార్చుకున్నారని, ఈ సర్వే పేరుతో లింక్ లు పంపించి బ్యాంకు ఖాతాలను కొల్లగొడుతున్నారని హెచ్చరించారు. కుటుంబ సర్వే పేరుతో మొబైల్ ఫోన్‌కు ఎలాంటి లింక్ వచ్చినా ఓపెన్ చేయొద్దని సూచించారు. ఒకవేళ ఈ లింక్స్ నిజమే అనుకుని క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలోని సొమ్ము మొత్తం కాజేస్తారని చెప్పారు. దీంతో పాటు కుటుంబ సర్వే పేరుతో ఎలాంటి ఫోన్ కాల్ వచ్చినా స్పందించవద్దని సైబర్ పోలీసులు హెచ్చరించారు. సర్వే కోసం కాల్ చేశామని చెప్పి ఓటీపీ అడిగితే ఎట్టిపరిస్థితుల్లోనూ చెప్పొద్దన్నారు. ఈ నెల 6 నుంచి తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. ఈ సర్వే కోసం అధికారులు, ప్రభుత్వ సిబ్బంది నేరుగా మీ ఇంటికే వస్తారని, వివరాలు నమోదు చేసుకుని వెళతారని సైబర్ పోలీసులు స్పష్టత నిచ్చారు. ఫోన్ ద్వారా, ఆన్ లైన్ లింక్ ల ద్వారా సర్వే చేయడంలేదని వివరించారు. ఈ సర్వే పేరుతో ఏదైనా లింక్ లు కానీ ఫోన్ కాల్ కానీ వస్తే స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలంటూ ముందుగానే ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

### ఆలయాల పేర్లు మార్చడం కాదు..

## భద్రత కల్పించండి

### కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్

**శంషాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లనే హిందూ దేవాలయాలపై వరుస దాడులు జరుగుతున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఏ దేవాలయంపై దాడి జరిగిన ఇది పిచ్చివాడి పని అని కేసులను మూసివేస్తుండడంతో దుండగులు మరింత రెచ్చిపోయి హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. శంషా బాద్ పట్టణంలోని ఎయిర్‌పోర్ట్ కాలనీలో మంగళవారం తెల్ల వారుజామున హనుమాన్ దేవాలయంలోని నవగ్రహ విగ్రహాలపై గుర్తు తెలియని దుండగులు దాడిచేసిన ప్రదేశాన్ని ఆయన శుక్రవారం పరిశీ లించారు. పోలీస్ అధికారులు కాలనీవాసులతో మాట్లాడి అక్కడ జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్నారు. జిల్లా బిజెపి అధ్యక్షుడు నర్సింహారెడ్డి. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్. డాక్టర్ ప్రేమ్ రాజ్. మైలార్ దేవ్ పల్లి కార్పొరేటర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దేవాలయాల పేర్లను మార్చడం ముఖ్యం కాదు దేవాలయాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలో అధికారంలో ఉంటే అక్కడ హిందువులపై దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి. టిఆర్ఎస్ కమ్యూనిస్టు పార్టీలకు హిందువుల ఓట్లు అవసరం లేదా అని ఆయన నిలదీశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈరోజు మధ్యాహ్నం శంషాబాద్ లోని కట్ట మైసమ్మ దేవాలయంలో దాడి జరగడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్. మల్లారెడ్డి. వై శ్రీధర్. నాన్న వాళ్ళ కుమార్ యాదవ్. సునిగాంటి సిద్ధులు, కొండా పరమేష్ గౌడ్. రాహుల్ గాజుల మండే కుమార్‌యాదవ్, రాజిరెడ్డి, బాతుకు శ్రీనివాస్ యాదవ్, కనకమామిడి కిట్టు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా విద్యావంతుల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులుగా స్వర్ణలత, శ్వేత

**హైదరాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** తెలంగాణ మహిళా విద్యా వంతుల ఫోరం రాష్ట్ర నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వద్దిరాజు స్వర్ణలత, తలమల్ల శ్వేత హుసేన్ ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే ట్రెజరర్‌గా స్వప్న, వైస్ ప్రెసిడెంట్‌గా నాగపురి రోజా, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ రేష్మ నియమితులయ్యారు. డిసెంబరు 20వ తేదీన మహిళా విశ్వ విద్యాలయంలో ఆవిర్భావ సభను నిర్వహించాలని తీర్మానించినట్లు జనరల్ సెక్రటరీ శ్వేత వెల్లడించారు.

## కెడబ్ల్యుడిటి కేసు డిసెంబరు 5, 6కు వాయిదా

**హైదరాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** కృష్ణా ట్రిబ్యునల్ కేసు డిసెంబరు 6,7కు వాయిదా వేశారు.ఆంధ్రప్రదేశ్ తరఫున ఉన్న సాక్షి సిడబ్ల్యుసి మాజీ అధికారి ఎకె గోయల్ ను తెలంగాణ అడ్వకేట్లు చేసిన క్రాస్ ఎగ్జామినేషన్ శుక్రవారం ముగిసింది.ఎపి (ఎపిడబ్ల్యు1)కి చెందిన గోయల్‌ను తెలంగాణ సీనియర్ న్యాయవాది బుధ, గురు, శుక్ర వారాలు వరుసగా క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. సాక్షి క్రాస్ ఎగ్జామినేషన్‌ను పేర్కొన్న అంశాలపై రెండు రాష్ట్రాలు మెమోలు, దరఖాస్తులను దాఖలు చేయడానికి ట్రిబ్యునల్ అనుమతించింది. కృష్ణా జలాలలో 75 శాతం విశ్వసనీయ జలాలు డిపెండబిలిటీ ఆధారంగా 811 టిఎంసి ల కేటాయింపు రక్షిత వినియోగాన్ని పరిగణించాలని తెలంగాణ అడ్వకేట్లు క్రాస్ ఎగ్జామినేషన్‌లో గోయల్ తెలిపారు,

## ఎల్ఐసి ప్రీమియం ఆదాయం రూ.2,33,671 కోట్లు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్థభాగానికి ఎల్ఐసీకి 18,082 కోట్ల రూపాయల మేర లాభం చేకూరింది. గత ఏడాది ఇదే కాలానికి వచ్చిన లాభం 17,469 కోట్ల రూపాయలతో పోల్చి చూస్తే ఈ సారి 3.51 శాతం వృద్ధి రేటు నమోదైంది. జీవిత బీమా మొత్తం మార్కెట్‌లో ఎల్ఐసీ లీడర్‌గా కొనసాగుతోంది. ఏప్రిల్ నుండి సెప్టెంబరు వరకూ జరిగిన సంస్థ కార్యకలాపాలను గూర్చి ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో సంస్థ ఏకీకృత ఆర్థిక ఫలితాలను ఎల్ఐసీ బోర్డ్ ఆఫ్ డైరక్టర్లు ఆమోదించినట్లు వెల్లడించింది. ఈ అర్ధ సంవత్సరంలో మొత్తం జీవిత బీమా మార్కెట్‌లో ఎల్ఐసీ వాటా 61.07 శాతంగా నమోదైంది. గత ఏడాది ఇదే సమయానికి 58.50 శాతం ఉండగా, అది ఈ సారి 2 శాతానికి పైగా పెరుగుదల రేటు రికార్డయింది. వ్యక్తిగత వ్యాపారంలో 39.79 శాతం, గ్రూప్ వ్యాపారంలో 74.77 శాతం వాటా కలిగి ఉంది. కాగా ప్రీమియం ద్వారా 2,33,671 కోట్ల రూపాయల మేర ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే కాలానికి పోలిస్తే 2,05,760 కోట్ల రూపాయల మేర ఉన్న ఆదాయం ఈ ఏడాది 13.56 శాతం చొప్పున వృద్ధి రేటు నమోదైంది. ఇక కొత్త ప్రీమియం ద్వారా 29,538 కోట్ల రూపాయలు వచ్చింది. అదే వ్యక్తిగత పునరుద్ధరణ ప్రీమియం 1,15,158 కోట్ల రూపాయలుగా ఉంది. అలాగే వ్యక్తిగత విభాగంలో మొత్తం 91,70,420 పాలసీలు విక్రయించబడగా, గత సంవత్సరం ఇదే సమయానికి 80,60,725 పాలసీలు ఇవ్వడం జరిగింది. మొత్తం మార్కెట్ వాటా 61.07 శాతానికి పెరిగింది.

## కర్ణాటకలో రెండోరోజు హైడ్రా బృందం పర్యటన

### కెటిసిడిఎ సిఇఒ రాఘవన్‌తో హైడ్రా కమిషనర్ రంగనాథ్ భేటీ

### చెరువుల పరిరక్షణకు కర్ణాటక చేపడుతున్న చర్యలపై అధ్యయనం



**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువుల పరిరక్షణకు నడుం బిగించింది. కర్ణాటకలో అమలవుతున్న చెరువుల పరిరక్షణ చర్యలను తెలుసుకోవడానికి హైడ్రా కమిషన్ రంగనాథ్ తన టీంతో కలిసి అక్కడికి వెళ్లారు. కర్ణాటక ట్యాంక్ కన్సర్వేషన్, కెటిసిడిఎ సీఈఓ రాఘవన్, డెవలప్మెంట్ అథారిటీ అధికారులతో శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమావేశం అయ్యారు. చెరువుల పరిరక్షణకు కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కెటిసిడిఏ యాక్ట్ 2014ను హైడ్రా అధికారుల బృందం పరిశీలించారు. చెరువుల పరిరక్షణలో కర్ణాటక ట్యాంట్ కర్వర్జేషన్ అండ్ డెవలప్ మెంట్ అథారిటీ చేపడుతున్న చర్యలపై అధ్యయనం చేశారు. ఎఫ్‌టిఎల్ తో పాటు బఫర్ జోన్స్ లో వున్న భూమి మొత్తం ప్రభుత్వ భూమిగా పరిగణిస్తున్నామని కెటిసిడిఏ సీఈఓ రాఘవన్ తెలిపారు. బఫర్ జోన్‌ను కర్ణాటకలో మార్జిమం వాటర్ లెవెల్ గా పరిగణిస్తామని తెలిపారు. దిశాంక్ అనే ఆప్‌లో ప్రభుత్వ భూమి, పట్టా భూమి ఏదని, ఆ ల్యాండ్ ఓనర్ ఎవరనే వివరాలు కూడా తెలుసుకోవచ్చున్నారు. హైడ్రా అధికారులు చెరువు ఆక్రమణ నివారించేందుకు కెటిడిసిఏ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేశారు. చెరువుల అభివృద్ధిలో డిపిఆర్ రూపొందించడం, దానిని టెక్నికల్ టీం అధ్యయనం చేయడం.. తర్వాత పనులను చేపట్టడం వంటి విధానాలను సీఈఓ రాఘవన్ వివరించారు.

## పార్టీలు, ఫంక్షన్లలో మద్యం వినియోగానికి అనుమతులు తీసుకోండి

### లేదంటే కేసులు తప్పవు : ఎక్సైజ్ శాఖ సూచన

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** ఫామ్ హౌస్‌లలో నిర్వహించే మద్యం పార్టీలు, ఫంక్షన్లు, వేడుకలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలనీ, లేదంటే జరిమానాలు, కేసులు తప్పవని తెలంగాణ ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ సూచిస్తున్నది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలో ఉన్న వందలకొద్దీ ఫాం హౌజ్‌లలో ప్రతీ రోజూ ఏదో ఒక మద్యం పార్టీ జరుగుతుంది. అయితే, ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా చేవెళ్లలోని అరవిల ఫామ్ హౌస్‌లో గత ఏడాది మద్యం పార్టీ నిర్వహించి పట్టుబడగా, ఫామ్ హౌస్ యజమానులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. తాజాగా, రెండు రోజుల క్రితం ఇదే ఫామ్ హౌస్‌లో అనుమతి లేకుండా మద్యం పార్టీ నిర్వహించి మరోసారి బుక్కయ్యారు. దీంతో అరవిల ఫామ్ హౌస్ యజమానులు ఇద్దరిపై రూ.లక్ష జరిమానా విధించారు. ఇక నుంచి అనుమతి లేకుండా మద్యం పార్టీలు నిర్వహించే నిర్వాహకులతో ఆపటు ఫామ్ హౌస్ యజమానులపై సైతం కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, ఫామ్ హౌస్‌లు ఫంక్షన్ హాల్స్, క్లబ్ హౌస్‌లు, కన్వెన్షన్ సెంటర్లు, రిసార్ట్స్‌లో ఎవరు మద్యం పార్టీ నిర్వహించినా ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలనీ శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ సూచించారు. లేని పక్షంలో ఫంక్షన్ హాల్ నిర్వాహకులు, యజమానులపై కేసులు నమోదు చేయడంతో పాటు ఫంక్షన్ హాల్స్‌ను బ్లాక్ లిస్టులో పెడతామనీ, మద్యం పార్టీల్లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వాడిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఎపి ఎమ్మెల్సీ రఘురాజు పై అనర్హత ఉత్తర్వులు రద్దు చేసిన హైకోర్టు

### న్యాయస్థానం సంచలన తీర్పు

**విజయవాడ,నవంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** శాసన మండలి సభ్యులు రఘురాజు పై ఆ మండలి చైర్మన్ ఇచ్చిన అనర్హత ఉత్తర్వులను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు తీర్పు ఇచ్చింది.ఈ నేపథ్యంలో ఈ అంశం సంచలనంగా మారింది. ఈ కేసులో . రఘురాజు వాదనలు వినకుండానే మండలి చైర్మన్ నిర్ణయం తీసుకున్నారన్న హైకోర్టు వ్యాఖ్యానించింది.ఆయనపై మండలి చైర్మన్ వేసి అనర్హత వేటు ఉత్తర్వులు రద్దు చేసింది. మరో సారి ఈ విషయాన్ని పరిశీలించాలని మండలి చైర్మన్ దగ్గరకు ఈ వ్యవహారాన్ని పంపింది. అప్ప టివరకు రఘురాజు ఎమ్మెల్సీ సభ్యత్వం కొనసా గిస్తున్నట్లు తెలిపింది. దీంతో నవంబర్ 28న విజయనగరం ఎమ్మెల్సీ ఉపఎన్నిక జరుగుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది 2021లో జరిగిన విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాంగ్రెస్ పార్టీ తరపున ఇందుకూరి రఘురాజు ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. 2024 ఎన్నికలకు ముందు రఘురాజు భార్య ఇందుకూరి సుధారాణి వైకాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీలో చేరారు. దీంతో పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని రఘురాజుపై వైకాంగ్రెస్ పార్టీ మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదుతో వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని ఇందుకూరి రఘురాజుకు నోటీసులు ఇచ్చారు మండలి చైర్మన్ అయితే ఆ తర్వాత రఘురాజు వివరణ ఇవ్వలే దంటూ ఆయనపై అనర్హత వేటు వేస్తున్నట్లు ప్రకటిం చారు. దీంతో తన వివరణ తీసుకోకుం డానే అనర్హత వేటు వేశారంటూ రఘురాజు అప్పుడే ఏపీ హైకోర్టుకు వెళ్లారు. ఆయన పిటిషన్ హైకో ర్టులో పెండింగ్‌లో ఉండగానే ఈసీ విజయనగరం ఎమ్మెల్సీ బైపోల్‌కు నోటిఫికేషన్ ఇచ్చింది. ఒక రోజు వ్యవధిలోనే హైకోర్టులో రఘురాజు పిటిషన్ విచారణకు వచ్చింది. మండలి చైర్మన్ ఇచ్చిన అనర్హత ఉత్తర్వులను కోర్టు రద్దు చేయడంతో కథ మళ్లీ మొదటికి వచ్చినట్లు అయింది. ఈ క్రమంలో ఈ శాసన మండలి స్థానానికి ఎన్నిక కోసం ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ ఇవ్వడం, వైకాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్ వేయడం జరిగింది.ఈ పరిస్థితుల్లో ఎన్నికల కమీషన్ ఏ నిర్ణయం తీసుకుంటుందోనదే రాజకీయంగా చర్చ.

## కేంద్రం నిధులు అందిస్తున్నా లక్ష్యాలను చేరుకోలేరా?

### అధికారులను నిలదీసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (బేగంపేట), నవంబరు 8, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం పథకాల కోసం పెద్ద ఎత్తున నిధులు అందజేస్తున్నా లక్ష్యాన్ని చేరుకోవడంలో ఇబ్బందులు ఎందుకు వస్తున్నాయంటూ కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అధికారులను నిలదీసారు.శుక్రవారం బేగంపేట కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన బేగంపేట టూరిజం ప్లాజాలో దిశా కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో పాటు మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్,వివిధ శాఖల అధికారులు,దిశా కమిటీ మెంబర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వచ్ఛభారత్‌మిషన్, ఎల్ఎండీ,(లీడ్‌బ్యాంక్ డిస్ట్రిక్ట్‌మేనేజర్) అన్ని బ్యాంకుల్లో ముద్ర లోన్స్ మరియూ ఎడ్యుకేషన్ లోన్స్, ఎంఎస్ ఎంఈలపై సమీక్షించారు. నగరంలో రైల్వేలు, ఎలక్ట్రిసిటీ, నేషనల్ హైవేస్,బ్రిడ్జిల నిర్మాణంతో పాటు తదితర వివరాలపై అధికారులను వివరాలను అడిగి తెల్సు కున్నారు.నిరుపేదలు,మహిళా సంఘాల ఉన్నతికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా ఎంత మొత్తాన్ని అందజేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు.సమావేశంలో అధికారులు అందించిన వివరాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసారు.వచ్చే సమావేశంలో ఆయా విషయాలపై పూర్తి ప్రాజెక్టు నివేదికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.సాంకేతిక సమస్యలే సాకులు చెప్పడం ఏంటని అన్నారు.అధికారులు,బ్యాంకర్లు లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు.ఆయా సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు రావాలన్నారు.కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను లబ్దిదారుల టార్గెట్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.అధికారులు,బ్యాంకర్ల మధ్య రుణాలు అందించే విషయంలో ఏదైనా ఇబ్బందులు తలెత్తితే తనకు తెలియ జేయా లన్నారు.నిధులు సమకూర్చే బాధ్యత తనకు వదిలివేయాలన్నారు.





రుణాల కోసం అందిన దరఖాస్తులు ఎన్ని,ఎన్ని రుణాలు అందజేసారు అని ప్రశ్నించారు.ఆయా విభాగాల అధికారులు కొన్ని వివరాలను వెల్లడించగా పూర్తి వివరాలు అందించడంలో స్పష్టత కరువైంది.దీంతో మంత్రి కలుగజేసుకొని అన్ని శాఖలు,బ్యాంకర్లు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు.సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు మరో సమావేశంలో తనకు అందజేయాలని అధికారులను ఆదేశిం చారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు రుణాలు అందించడంలో అధికారులు, బ్యాంకర్లు సొంత ఇళ్లు ఉండాలని, ధృవపత్రాలు ఉండాలని కొన్ని ఇబ్బందులకు గురి చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చింద న్నారు. గ్రూపులో ఒకరు డిఫాల్ట్ అయితే మొత్తం గ్రూపునే డిఫాల్ట్ కింద ఎందుకు పెడుతున్నారని, అధికా రులను ప్రశ్నించారు.ఆ ఒక్కరినే డిఫాల్ట్ లో పెట్టి వేరే సభ్యులను చేర్చి ఆ గ్రూపుకు తిరిగి ఆర్థిక సహాయం చేయాలని సూచించారు.ఈ విషయాన్ని కింది స్థాయి అధికారులకు కూడా తెలియజేయాలన్నారు. గ్రూపులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా పరిష్కరించాలే తప్ప కాంప్రమైజ్ కావద్దన్నారు. కొత్త సంఘాలు,ప్రస్తుతం ఉన్న సంఘాలపై ఆయన ఆరా తీసారు.

సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు రాష్ట్ర ప్రభుత్వం 2018 నుంచి నయాపైసా ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వం ద్వారానే సమకూరిన నిధులతో రుణాలు అందజేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు.కేంద్ర ప్రభుత్వం అంద జేస్తున్న పథకాలపై ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. ఎంతమందికి రుణాలిచ్చారు.టార్గెట్ ఎంత, మిగతావారికి రుణాలు ఎందుకు ఇవ్వలేదు,వంటి అనేక వివరాలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## వైభవంగా ఉద్దాల మహోత్సవం

### వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

### దాసంగాలతో స్వామివారికి నైవేద్యం

### బందోబస్తును పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ



స్వామివారి పాదుకలను దర్శించుకుంటున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ

**చిన్నచింతకుంట, నవంబరు 8, ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్య దైవం పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్స వాలలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల మహోత్స వానికి వేలాదిగా తరలి వచ్చిన భక్తుల గోవింద నామస్మరణతో మారుమ్రోగింది. మండలంలోని చిన్న వడ్డెమాన్ గ్రామంలో ఉద్దాల కర్మాగారంలో వారం రోజుల పాటు నియమ నిష్టలతో దళితులు తయారు చేసిన స్వామివారి పాదుకలను దర్శించు కునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఉద్దాల కర్మాగారం కిక్కిరిసిపోయింది.

**పల్లమరి నుంచి చాట ఊరేగింపు..**

పల్లమరి గ్రామలో వారం రోజులపాటు నియమ నిష్టలతో మేదరులు తయారుచేసిన చాటను జి. మధుసూదన్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై చాటను ఉంచి బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా లాల్‌కోట, నెల్లికొండి, పెద్ద వడ్డెమాన్ గ్రామాల మీదుగా చిన్న వడ్డెమాన్‌లోని ఉద్దాల కర్మాగారంకు తీసుకొచ్చారు. చాటను ఉద్దాల కర్మాగారంలోకి చర్మకారులు తీసు కొచ్చారు. అక్కడ స్వామివారి పాదుకలను చాటలో ఉంచి కర్మాగారం ముందు ఉన్న కట్టపైకి తీసుకొచ్చారు. స్వామివారి పాదుకలను చాటలో ఉంచి కర్మాగారం ముందు ఉన్న కట్టపైకి తీసుకొచ్చారు. స్వామివారి పాదుకలకు సాంప్రదాయం ప్రకారం నెల్లి వంశీయులు తొలిపూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మక్తల్ ఎమ్మెల్యే వాకిటటి శ్రీహరిలతోపాటు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి స్వప్న శివకుమార్‌లు పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి స్వామివారి పాదుకలను వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ సమీపంలోని ఊకచెట్టువాగులోకి తీసుకొచ్చారు. మహోత్సవంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఉద్దాల మహోత్సవాని జిల్లా ఎస్పీ జానకి, అడిషనల్ ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ రామకృష్ణలు పర్యవేక్షించారు.

## సైబర్ నేరాలపై ఎస్‌బిఐ అవగాహన

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ఖాతాదారుల్లో అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ ఎస్‌బిఐ సర్కిర్ కార్యాలయం వివిధ కార్యకలాపాలను చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం ఎస్‌బిఐ ఎసి గార్డెన్స్ బ్రాంచ్‌లో ఒక ఖాతాదారునికి 13 లక్షల రూపాయల మేర ఆదా చేసినట్లు ఎస్‌బిఐ ఒక ప్రకటనలో తెలిపింది. గత నాలుగు రోజులుగా డిజిటల్ అరెస్ట్ బెదిరింపులతో నిధుల బదిలీ కోసం బ్రాంచ్‌ను అతను సందర్శించాడు. ఖాతాదారుడు ఒత్తిడికి లోనవుతున్నాడని గ్రహించిన బ్యాంక్ సిబ్బంది అతను సైబర్ దాడికి గురవుతున్నట్లు గ్రహించారు. వెంటనే ఈ విషయాన్ని బ్రాంచ్ మేనేజరు దృష్టికి సిబ్బంది తీసుకెళ్లారు. ఈ విషయమై మేనేజర్ కమలాకర్ ఆ ఖాతాదారునికి సైబర్ నేరాల పట్ల తెలియచేసి మోసగాడి బెదిరింపులకు లొంగవద్దని నచ్చచెప్పి చివరకు ఒప్పించారు. అంతేకాకుండా సైబర్ క్రైమ్ పోలీసులకు ఈ సంఘటన గురించి సమాచారం అందించారు. చివరకు ఖాతాదారుని నుండి నిధుల బదిలీని నివారించారు. ఎట్టకేలకు ఖాతాదారుడు తాను సైబర్ దాడిలో ఉన్నానని గ్రహించి, సొమ్మ పోకుండా కాపాడిన ఎస్‌బిఐ స్బిందికి ధన్యవాదాలు తెలిపారు. ఏదైనా సైబర్ సెక్యూరిటీ సంబంధిత ఆందోళనలు, సైబర్ క్రైమ్‌లు, మోసాలకు సంబంధించి తక్షణమే 1930లో ఫిర్యాదు చేయడం ద్వారా తమ ఖాతారుని అనుమానాదాస్పద లావాదేవీలను నిలుపు దల చేయడాన్ని బ్యాంక్ పునరుద్ఘాటిస్తున్నట్లు ఆ ప్రకటనలో తెలిపింది.



శుక్రవారం యాదాద్రీశుడిని దర్శించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు

## జీవన్‌దాన్ నోడల్ అధికారిగా డా.శ్రీభూషణ్‌రాజు నియామకం

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగం అధిపతిగా పనిచేస్తున్న శ్రీభూషణ్‌రాజు జీవన్‌దాన్ నోడల్ అదికారిగా నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం డీఎంఈ డా.ఎన్.వాణి సంబంధిత నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. జీవన్‌దాన్ నోడల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డా.శ్రీభూషణ్‌రాజు మాట్లాడుతూ కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స అందించడం, జీవన్‌దాన్ పథకం కింద అర్హులైన వారికి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు పారదర్శకంగా ఉండే విధంగా తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు డా.శ్రీభూషణ్‌రాజును అభినందించారు.

## ఇక్కడే ఉన్నా.. మీ ఎసిబిని పంపండి

### రేవంత్‌కు కెటిఆర్ వ్యంగ్యంగా ట్వీట్


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 8:** ఫార్ములాఈ రేస్ కుంభకోణంలో ప్రభుత్వం విచారణకు సిద్ధపడుతున్న తరుణంలో కాంగ్రెస్ కు అనుకూలంగా ఉండే ఒక మీడియాలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మలేసియా పారిపోయినట్లు కథనం రావడంపై కెటిఆర్ స్పందించారు. దీనిని ఆయన శుక్రవారంనాడు ఎక్స్ ఖాతా ద్వారా ఖండించారు. ఇదే సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డికి ట్విట్టర్‌లో బర్త్‌డే విషెస్ చెప్పిన కేటీఆర్ నేను హైదరాబాద్‌లోనే ఉన్నాను. మీ ప్రభుత్వ ఏజెన్సీలు ఎప్పుడైనా రావొచ్చు అంటూ ట్విట్ చేశారు.మీ బర్త్ డే సందర్భంగా వారితో కావాలంటే కేక్ కట్ చేయిస్తానని, ఛాయ్, ఉస్మానియా బిస్కెట్లు కూడా ఇస్తా అంటూ పేర్కొన్నారు.

## డిసెంబరు 29న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల రాత పరీక్ష

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం వేగవంతం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 1520 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు(ఫిమేల్) డిసెంబర్ 29న రాత పరీక్ష నిర్వహించనుంది. దీనికి సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తులు సమర్పించే ప్రక్రియ కూడా పూర్తయింది. దీంతో ఈ పోస్టులకు డిసెంబర్ 29న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు బోర్డు శుక్రవారం వెల్లడించింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) విధానంలో ఎగ్జామ్ నిర్వహిస్తామని బోర్డు పేర్కొంది.

## బీరూట్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

**జెరూసలెం, నవంబరు 8:** ఇజ్రాయెల్‌మిలిటరీ హెజ్బొల్లా బలగాలమధ్య పోరు భీకరంగా మారింది. లెబనాన్‌లోని పలు స్థావరాల్ని ఇజ్రాయెల్‌సైన్యం టార్గెట్‌చేస్తే హెజ్బొల్లా బలగాలు ఆదేశంలోని ఉత్తర,మధ్యప్రాంతాలపై రాకెట్ దాడులకు దిగింది.



హెజ్‌బొల్లా రాకెట్ దాడుల్లో అనేక ఇళ్లు ధ్వంసం అయ్యాయని, అనేక మంది తీవ్రంగా గాయపడగా వారిని దవాఖానలకు తరలిం చామని ఇజ్రాయెల్ మిలిటరీ అధికారులు వెల్లడించారు. మరోవైపు లెబనాన్ రాజధాని బీరూట్ సహా వివిధ నగరాల్లో భీకరమైన దాడులతో ఇజ్రాయెల్ సైన్యం భీకరపోరుచేసింది. బీరూట్ శివారుప్రాంతాలపై వైమానిక దాడులు ఉధృతంచేసింది. లెబనాన్‌లోని ఏకైక అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని ఓప్రాంతంపైనా వైమానిక దాడులు జరిపింది. మధ్యలెబనాన్‌లోని బార్జా పట్టణంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరపగా 30 మృతదేహాల్ని వెలికితీసినట్లు లెబనాన్ రెస్క్యూసిబ్బంది తెలిపారు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులుచేసిందని లెబనాన్ ఆరోపించింది. తాము ముందుగానే నోటీసులు ఇచ్చామని హెజ్‌బొల్లా స్థావరాలే లక్ష్యంగా దాడులుచేసినట్లు ఇజ్రాయెల్‌ప్రకటించింది. బీట్ లాహియాలోగ్రౌండ్ ఆపరేషన్‌చేపట్టామని వెల్లడించింది. ఇక ఇజ్రాయెల్ ఆక్రమిత పాలస్తీనాలో అక్కడిపౌరులు ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడ్డవారి కుటుంబసభ్యులపై బహిష్కరణ వేటు వేయాలనినెతన్యాహు ప్రభుత్వం చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టాన్ని ఇజ్రాయెల్ పార్లమెంటు ఆమోదించింది.

# ఛాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా రెడీ




## దిగొచ్చిన పాకిస్థాన్ బోర్డు
## భారత్‌కు హైబ్రిడ్ మోడల్ ఓకె
## రూ.544 కోట్లతో ఐసిసి ప్లాన్ బి

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌లో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో టీమిండియా ఆడే విషయంలో ఎట్టకేలకు సందిగ్ధం వీడింది. ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ విధానంపై ఓ స్పష్టత వచ్చింది. టోర్నమెంట్‌లో టీమిండియా ఆడే మ్యాచ్‌లను హైబ్రీడ్ మోడల్ విధానంలో నిర్వహించేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) అంగీకరించింది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనున్న ఈ టోర్నీలో టీమిండియా ఆడే మ్యాచ్‌లను సర్దుబాట్ల చేసుకోవడానికి పిసిబి సిద్ధమవుతోంది. దీంతో టీమిండియా తమ అన్ని మ్యాచ్‌లను దుబాయ్ లేదా షార్జాలో ఆడేలా షెడ్యూల్‌లో మార్పులు చేసే ఆలోచన చేస్తోంది. పాకిస్థాన్ పర్యటనకు వెళ్లేందుకు టీమిండియాకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ట్రోఫీలో పాల్గోవడం లేదనే సంకేతాలు వెళ్లాయి. అయితే టీమిండ ియాను పాకిస్థాన్ రప్పించేందుకు పిసిబి గట్టి ప్రయత్నాలు చేసినా అందుకు కేంద్రం అంగీకరించ లేదు. దీంతో ట్రోఫీ నిర్వహణ షెడ్యూల్‌లో కొన్ని మార్పులు చేయాలని పిసిబి నిర్ణయం తీసుకుంది. ఇక ఇన్ని రోజులు భారత్ మ్యాచ్‌లపై స్పష్టత రాకపోవడం వల్ల ఐసిసి తుది షెడ్యూల్‌ను ఖరారు చేయకుండా పెండింగ్‌లో పెట్టింది. ఎట్టకేలకు ఈ మ్యాచ్‌లపై స్పష్టత రావడంతో ట్రోఫీ ఫైనల్ షెడ్యూల్ ఈ నెల 11న వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలో ప్రారంభం కానుంది. హైబ్రిడ్ మోడల్ ఫైనలైజ్ అయినట్లయితే భారత్ ఆడే మ్యాచ్‌లు మినహా మిగతా టోర్నీ అంతా పాక్‌లోనే జరగనుంది. కాగా సరిహద్దు వివాదం కారణంగా టీమిండియా కొన్నేళ్లుగా పాకిస్థాన్ పర్యటించడం లేదు. ఈ రెండు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు కూడా జరగడం లేదు. భారత్, పాకిస్థాన్ జట్లు బయట జరుగుతున్న ఐసిసి ఈవెంట్లలో మాత్రమే పోటీ పడుతున్నాయి. ఇక గత ఏడాది ఆసియా కప్ టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్య దేశంగా వ్యవహరించింది. భద్రత కారణాల దృష్ట్యా పాక్‌కు వెళ్లేందుకు టీమిండియా నిరాకరించింది. దీంతో దాన్ని హైబ్రిడ్ పద్దతిన భారత్ మ్యాచ్‌లను నిర్వహించింది. ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఐసిసి ఇప్పటికే 65 మిలియన్ డాలర్లు (రూ.544 కోట్ల)తో ప్లాన్ బితో సిద్ధంగా ఉంది. ట్రోఫీ నిర్వహణ కోసం ఈ మొత్తాన్ని పాకిస్థాన్‌కు ఇప్పటికే ఐసిసి అందించినట్లు సమాచారం.

ఈవెంట్ కోసం పిసిబి అందుకున్న మొత్తం, టోర్నమెంట్ కోసం టీమిండియా పాక్‌కు వెళ్లకపోవడం వల్ల అయ్యే ఖర్చులను కూడా కవర్ చేస్తుంది. అంటే పిసిబి అదనంగా మరింత నిధులు అందిస్తోంది. ఈ సొమ్ముతో పాక్ వెలుపల వేరే వేదికలో టీమిండియా, పాక్ మధ్య జరిగే మ్యాచ్‌లను నిర్వహించేందుకు ఉపయోగించనుంది. అంటే భారత్, పాక్ మధ్య జరిగే మ్యాచ్‌లు హైబ్రీడ్ పద్దతిలో నిర్వహించే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయనేది ఇప్పటికే నిర్ధారణ అయింది. తొలుత హైబ్రీడ్ పద్దతిన పాక్‌తో మ్యాచ్‌ల ఆడేందుకు భారత్ ముందుకువచ్చినా, అందుకు పీసీబీ వ్యతిరే కించింది. అయితే ఐసీసీ మాత్రం ప్రత్యమ్నా యంలో భాగంగా హైబ్రీడ్ పద్దతిన భారత్, పాక్ మధ్య మ్యాచ్ నిర్వహించేందుకు నిమిత్తమే ప్లాన్ బిని తెరముందుకు తెచ్చింది.




## ప్రపంచ రెండో ర్యాంకర్‌గా అర్జున్
### చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్ మాస్టర్ రెండో విజయం

**న్యూఢిల్లీ:** చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత్ నవంబర్ వన్, తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఇరిగేశి అర్జున్ రెండో విజయానిన అందుకున్నాడు. సెర్బియా గ్రాండ్ మాస్టర్ అలెక్సీ సరానాతో చెన్నైలో జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన అర్జున్ 37 ఎత్తుల్లో గెలిచాడు. ఎనిమిది మంది గ్రాండ్ మాస్టర్ల మధ్య 7 రౌండ్ల పాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. మూడో రౌండ్ తర్వాత అర్జున్, ఇరాన్‌కు చెందిన అమీన్ తబాతబాయి 2.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగు తున్నారు. తాజా ఫలితంతో 21 ఏళ్ల అర్జున్ అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) లైవ్ ర్యాంకింగ్స్‌లో 2805.8 ఎలో రేటింగ్ పాయింట్లతో ప్రపంచ రెండో ర్యాంకర్‌గా అవతరించాడు. ఇప్పటి వరకూ రెండో ర్యాంక్‌లో ఉన్న అమెరికా గ్రాండ్ మాస్టర్ కరువానా 2805 పాయింట్లతో మూడో స్థానానికి పడిపో యాడు. 2011లో విశ్వనాదన్ ఆనంద్ తర్వాత ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 2వ స్థానానికి చేరిన భారత్ ప్లేయర్‌గా అర్జున్ గుర్తింపు పొందాడు. లైవ్ రేటింగ్స్ అనేవి ప్రతీ టోర్నీలో రౌండ్ రౌండ్‌కూ మారుతుంటాయి. ప్రతీ నెలా 1వ తేదీన ఫిడే ప్రకటించే అధికారిక ర్యాంకింగ్స్‌నే ఆటగాళ్ల తుది ర్యాంక్‌గా పరిగణిస్తారు. గత నెలలో సెర్బియాలో జరిగిన యూరోపియన్ చెస్ క్లబ్ కప్ టోర్నీ 5వ రౌండ్ తర్వాత లైవ్ రేటింగ్స్‌లో అర్జున్ తొలిసారి 2800 పాయింట్లను అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన 16వ చెస్ ప్లేయర్‌గా అతను గుర్తింపు పొందాడు. అయితే అదే టోర్నీలోని 6వ రౌండ్, 7వ రౌండ్‌లో అర్జున్ తన తన గేమ్‌లను డ్రా చేసుకోవడంతో అతని లైవ్ రేటింగ్ 2800 లోపు వచ్చింది. ఈ నెల 1వ తేదీన ఫిడే అధికారికంగా వెలువరించిన ర్యాంకింగ్స్‌లో అర్జున్ 2799 రేటింగ్‌తో ప్రపంచ 4వ ర్యాంకర్‌గా ఉన్నాడు.

## నిప్పులు చెరిగిన భారత్ బౌలర్లు
### 223 పరుగులకు ఆస్ట్రేలియా ఆలౌట్

**న్యూఢిల్లీ:** భారత్ బౌలర్ల ధాటికి ఆస్ట్రేలియా 223 పరుగులకు ఆలౌట్ అయింది. మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియా-ఎ జట్టుతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత్-ఎ జట్టు బౌలర్లు అద్భుతమైన ప్రదర్శన కనపరిచారు. తొలి ఇన్నింగ్‌లో ఆస్ట్రేలియా 223 పరుగులకు ఆలౌట్ అయింది. 3 వికెట్ల నష్టానికి 52 పరుగు లతో ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు శుక్రవారం ఆటను ప్రారం భించిన ఆస్ట్రేలియా అదనంగా 171 పరుగులు చేసి తమ తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. దీంతో కంగారులకు మొదటి ఇన్నింగ్స్‌లో 62 పరుగుల ఆధిక్యం లభించింది. భారత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 4 వికెట్లు పడగొట్టగా, ముఖేష్ కమార్ 3 వికెట్లు, ఖలీల్ అహ్మద్ 2 వికెట్లు దక్కించుకున్నారు. అంతకు ముందుకు భారత్-ఎ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 161 పరుగులకే కుప్పకూలింది. టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ ధ్రువ్ జురెల్ 80 పరుగులు చేసి అర్థ సెంచరీతో రాణించగా, మిగిలిన బ్యాటర్లంతా విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నీసర్ 4 వికెట్లు, వెబ్‌స్టర్ 3 వికెట్లు సాధించారు.

**వాణిజ్యం**

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, నవంబరు 8:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిసాయి. ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంకు వంటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. దీనికి తోడు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు క్రమంగా తమ నిధులను మార్కెట్ నుంచి బయటకు తీసుకెళ్లడం సూచీల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ ఉదయం 79,611.90 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమై, కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. రోజంతా ఒడుదుడుకుల్లో కదలాడిన సూచి, ఇంట్రాడేలో 79,117.37 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. చివరికి 55.47 పాయింట్ల నష్టంతో 79,486.32 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 51.15 పాయింట్లు క్షీణించి 24,148 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.84.37గా ఉంది. ఏసియన్ పెయింట్స్, టాటా స్టీల్, ఎస్‌బిఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టిపిసి, టాటా మోటార్స్, ఐసిఐసిఐ బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, భారతీఎయిర్‌టెల్ వంటి షేర్లు నష్టపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, టైటాన్ కంపెనీ, ఇన్ఫోసిస్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్ వంటి షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 74.63 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2,696.10 డాలర్ల వద్ద కొనసాగింది.

## ఐపిఒకు ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ

**ముంబై, నవంబరు 8:** ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ ఐపీవోకు వస్తుంది. వాస్తవానికి ఇది పూర్తి గా ప్రభుత్వ యాజ మాన్యంలోని ఎన్టీపీసీ లిమిటెడ్ సబ్సిడరీ సంస్థ కావటం గమ నార్హం. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకా రం కంపెనీ ఐపీవో నవంబరు మూడవ వారంలో దేశీయ స్టాక్ మార్కెట్ల ముందుకు రాబోతోందని వెల్లడైం ది. అజ్ఞాత వ్యక్తులు అందించిన సమాచారం ప్రకారం నవంబర్ 18న సోమవారం రోజున పెట్టుబడి దారుల సబ్‌స్క్రిప్షన్ కోసం దరఖాస్తు చేసు కునేందుకు వెసులు బాటు కల్పించబడ నుంది. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ తాజా ఐపీవో ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి ఏకం గా రూ.10,000 కోట్లను సమీకరించాలని చూస్తున్న ఐపీవో విక్రయిస్తున్న షేర్లు పూర్తిగా ఫ్రెష్ షేర్లని వెల్లడైంది. కంపెనీ షేర్లు ఏకకాలం లో ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో లిస్ట్ అవుతా యి. ఈ యేడాది ఐపీవోలో రూ.10,000 కోట్ల కంటే ఎక్కువ మూలధనాన్ని సమీకరించిన మూడో అతిపెద్ద ఐపీవోగా ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ అవతరించనుంది. ఇప్పటికే ఇన్వెస్టర్ల నుంచి ఈ ఐపీవోకు భారీ స్పందన లభిస్తుండగా కంపెనీ త్వర లోనే తన ఐపీవో ప్రైస్ బ్యాండ్ ధరను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఏడాది మార్కెట్ల నుంచి భారీగా డబ్బు సమీకరించిన ఐపీవోల జాబితాలో రూ.27,856 కోట్లతో హ్యుందాయ్ మోటార్స్ తొలిస్థానం లో నిలవగా.. స్విగ్గీ లిమిటెడ్ రూ.11,327 కోట్లను సమీ కరిస్తూ ప్రస్తుతం రెండవ స్థానాన్ని దక్కించుకుంది. 2022 ఏప్రిల్‌లో స్థాపించబడిన ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఆగస్టు చివరినాటికి 3,071లీజూ సోలార్ ఎనర్జీ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇదే క్రమంలో విండ్ ఎనర్జీ కేటగిరీ కింద 100లీజూ కార్యాచరణ సామ ర్థ్యాన్ని కలిగి ఉంది. కంపెనీ పోర్ట్ ఫోలియోలో 14,696 మెగావాట్లు ఉండగా, ఇందులో 2,925మెగావాట్ల కార్యాచరణ ప్రాజెక్టులు, 11,771 మెగావాట్ల కాంట్రాక్ట్‌తో పాటు కొన్ని పూర్తయిన ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే ఇన్వెస్టర్లు రెన్యూవబుల్ ఎనర్జీ రంగంలో కంపెనీలపై ఎంత దృష్టి సారించారనే విష యాన్ని గతనెల చివర్లో లిస్టింగ్ అయిన వారీ ఎనర్జీస్ కంపెనీ షేర్ల పనితీరు ను పరిశీలిస్తే అర్థం అవుతుంద ని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.